FOR ADS......
ఆకాంక్ష
CONTACT:
8333818121


# తొలి ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక TGTEL/25/A1964



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కార మార్గాలనే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న తొలి ఆకాంక్ష దినపత్రికలో భువనగిరి, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, జగిత్యాల, జనగాం, మహబూబ్ నగర్, నల్గొండ, ఖమ్మం, ఆదిలాబాద్, కామారెడ్డి, యాదాద్రి మేడ్చల్ మల్కాజిగిరి, వరంగల్, జోగులాంబ గద్వాల్ , సూర్యాపేట, జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్‌తో పాటు ...
అన్ని జిల్లాలోని నియోజక వర్గ కేంద్రాలకు విలేకరులు కావలెను ..

సంప్రదించండి...
8333818121

ఎడిటర్ పెనగొండ సతీష్
తొలి ఆకాంక్ష


ప్రచురణ : తెలంగాణ సంపుటి : 01 సంచిక :217 ఎడిటర్ : పెనగొండ సతీష్ పేజిలు : 08, వెల. 5రూ/ మంగళవారం- 31 - మార్చి - 2026

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు



రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు.

"రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం.

అమరావతి : తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. మిగతా..2లో

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ



టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని

భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది.

తిరుమల కొండపై భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం కావడంతో భక్తుల తాకిడి సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుతం 10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (మార్చి 29) నాడు మొత్తం 80,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. మిగతా..2లో

## అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపాలంటూ అసెంబ్లీలో తీర్మానం..




- అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది.
- ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు.
- మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

హైదరాబాద్: అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో

## కేసీఆర్ ను గృహ నిర్బంధం చేశారనేది

# నా అనుమానం

- దేశంలో నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఏదేదో మాట్లాడుతున్నారని, తెలంగాణలో రాష్ట్రపతి పాలన పెడతామని అంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు.
- మరి బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పెట్టరా? అంటూ ప్రశ్నించారు.
- నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ నేత కె. లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు.



హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ విశ్రాంతి తీసుకుంటున్నారని అందరూ భావిస్తున్నారని... కానీ, ఆయన గృహ నిర్బంధంలో ఉన్నారేమో అనేది తన అనుమానం అని అన్నారు. రావణుడి వల్లే రాముడి గొప్పతనం ఏమిటో తెలిసిందని... అలాగే కేసీఆర్ ఉండటం వల్ల తనకు గుర్తింపు వచ్చిందని చెప్పారు. మిగతా..2లో

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- మిలియన్ మార్చ్' సందర్భంగా నమోదైన పాత కేసుల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.
- దశాబ్ద కాలం గడిచినా ఈ కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని తక్షణమే కొట్టివేయాలని వారు న్యాయస్థానాన్ని కోరారు.




హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అత్యంత కీలక ఘట్టమైన 'మిలియన్ మార్చ్' సందర్భంగా నమోదైన పాత కేసుల వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు ఈరోజు విచారణ జరిపింది. 2011లో ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన మిలియన్ మార్చ్ సందర్భంగా జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు తాము శాంతియుతంగా నిరసన తెలిపామని, అయితే అప్పటి ప్రభుత్వం

## బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం




- ఎన్నికల్లో కలిసొచ్చే మతపరమైన అంశాలపైనే ప్రధాని మాట్లాడుతారు
- శబరిమలలో ఏం జరిగిందో మోదీ మర్చిపోయారు- అయ్యప్ప ఆలయం బంగారం స్థానంలో ఇత్తడిని పెట్టారు- ఎల్‌డీఎఫ్‌తో రహస్య అవగాహన వల్లే మౌనం
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్

ఢిల్లీ : ఎక్కడికి వెళ్లినా ఆలయాలు, మతం గురించే మాట్లాడే ప్రధాని మోదీ, పాలక్కడ్ ఎన్నికల ప్రసంగంలో శబరిమల అంశంపై మౌనం వహించడం సరికాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

## సైనికులకు న్యాయం

# సులభంగా అందాలి

- వాళ్లు రెండు యుద్ధాలు చేసే పరిస్థితి తీసుకురావద్దు: సీజేఐ
- కేంద్రపాలిత ప్రాంతం లేహ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్
- ఈ క్రమంలో దేశ సైనికుల గురించి కీలక వ్యాఖ్యలు
- సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలన్న సీజేఐ




ఢిల్లీ : దేశ సైనికుల గురించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైనికులను వారి చట్టపరమైన హక్కుల కోసం సరిహద్దుల్లో ఒకటి, స్వదేశంలో మరొకటి, ఇలా ఒకేసారి రెండు యుద్ధాలు చేసేలా దేశం బలవంతం చేయకూడదని అన్నారు. సైనికులకు మెరుగైన న్యాయ సదుపాయం కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్రపాలిత ప్రాంతం లేహ్ జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీజేఐ సూర్యకాంత్ ఈ మేరకు వ్యాఖ్యానించారు. న్యాయవ్యవస్థకు, సాయుధ దళాలకు మధ్య ఉన్న పరస్పర సహకార సంబంధాన్ని సీజేఐ సూర్యకాంత్ ప్రముఖంగా ప్రస్తావించారు.

## అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి గత దశాబ్ద కాలంలో అన్నీ మారిపోయాయ్

- అసోంలో బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడిన మోదీ
- కాంగ్రెస్ దుష్పరిపాలన గురించి తొలిసారి ఓటు వేస్తున్న వారికి తెలియజేయాలని వెల్లడి



ఢిల్లీ : అసోంలో ఒకప్పుడు దీర్ఘకాలం అస్థిరత, అశాంతి నెలకొన్నప్పటికీ, గత దశాబ్దంలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నించిందని తెలిపారు. ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న అసోంలో 'మేరా బూత్ సబ్సే మజ్‌బూత్ సంవాద్' కార్యక్రమంలో భాగంగా బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలతో మాట్లాడుతూ మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

### 'రాష్ట్ర అభివృద్ధికి శాంతి పునాది'

గతంలో హింసతో అల్లకల్లోలమైన అసోం ఇప్పుడు నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందనిగ మిగతా..2లో

## అమరావతిని రాజధానిగా ఒప్పుకుంటున్నారా?..

వైసీపీకి హోంమంత్రి సూటి ప్రశ్న




- గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో చాలా ప్రాజెక్టులను ఎత్తేసిన పరిస్థితి ఏర్పడిందని హోం మంత్రి అనిత విమర్శించారు.
- వైసీపీ వాళ్ల వాటాలు, భాగస్వామ్యం అడిగారు కాబట్టి చాలా ప్రాజెక్టులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు.

## 2029కి అందరికీ ఇళ్లు

# 21 నెలల్లోనే రెండోసారి పంపిణీ

- తిరుపతి జిల్లాలో టిడ్కో ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు
- లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందజేత
- పేద కుటుంబాలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడి




అమరావతి: ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ 2029 నాటికి ఇల్లు నిర్మించి ఇస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ప్రతి పేద కుటుంబానికి శాశ్వతంగా ఇల్లు నిర్మించి ఇవ్వాలనేదే కూటమి సర్కార్ సంకల్పమని తెలిపారు. తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం పుదూరులో టిడ్కో గృహాల గృహ ప్రవేశ కార్యక్రమంలో సీఎం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి లబ్ధిదారులకు ఇంటి తాళాలు అందించారు. టిడ్కో గృహాల వద్ద ఏర్పాటు చేసిన పార్కు, వాకింగ్ ట్రాక్, ఇతర మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. రెండో విడతలో రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాంతాల్లో 2 లక్షల 50 వేల 893 గృహాలను ప్రభుత్వం అందించింది. జీ+3 విధానంతో సకల హంగులు, పూర్తి నాణ్యతతో మిగతా..2లో

## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..

# రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు.
- విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు ఏర్పాటు



అమరావతి : విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి. రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

## అమరావతిని రాజధానిగా ఒప్పుకుంటున్నారా?..

విజయనగరం, మార్చి 30: ఏపీలో లా అండ్ ఆర్డర్ విషయంలో పటిష్ఠంగా పని చేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఈవ్ టీజింగ్ జరగకుండా శక్తి టీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. సోమవారం హోంమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. మూలపేట పోర్టు 70 శాతం పూర్తి చేసింది కూటమి ప్రభుత్వమే అని అన్నారు. ప్రతీ విషయంలో 'క్రెడిట్' చోరీ చేయాలని వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. 'మాది పని చేస్తున్న ప్రభుత్వం.. వాటాలు అడగని ప్రభుత్వం' అని తేల్చిచెప్పారు. గతంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో చాలా ప్రాజెక్టులను ఎత్తేసిన పరిస్థితి ఏర్పడిందని అనిత విమర్శించారు. వైసీపీ వాళ్లు వాటాలు, భాగస్వామ్యం అడిగారు కాబట్టే చాలా ప్రాజెక్టులు వెనక్కి వెళ్లిపోయాయన్నారు. రాజధాని అమరావతిపై మండలిలో కూడా తీర్మానం చేయాలని వైసీపీ నేతలు చెబుతున్నారని.. ఇంతకీ వారు రాజధానిగా అమరావతిని ఒప్పుకుంటున్నారా? లేదా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవేళ స్వాగతిస్తే ఎందుకు అసెంబ్లీకి రావట్లేదని నిలదీశారు. 'ప్రాజెక్టుల కోసం ఏ రైతు కూడా కన్నీరు కారుస్తూ భూమి ఇవ్వకూడదు. అది మా పాలసీ' అని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అహర్నిశలు కష్టపడుతున్నారని హోంమంత్రి అనిత పేర్కొన్నారు.

## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్..
## రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సార్' ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

### అందుబాటు ధరలు.. స్థానిక రుచులు

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది. ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

## కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు పిటిషన్లపై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

రాజకీయ కారణాలతో తమపై అక్రమ కేసులు నమోదు చేసిందని నిందితుల తరపు న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. దశాబ్ద కాలం గడిచినా ఈ కేసుల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటిని తక్షణమే కొట్టివేయాలని వారు న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై పూర్తి వివరాలతో కూడిన 'కౌంటర్' దాఖలు చేయాలని ప్రతివాదులైన రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత పోలీసు అధికారులకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అప్పటి ఘటనలకు సంబంధించిన ఎఫ్ఐఆర్ వివరాలు, ప్రస్తుత కేసు స్థితిగతులను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసింది.

## కేసీఆర్ ను గృహ నిర్బంధం చేశారనేది నా అనుమానం

నియోజకవర్గాల పునర్విభజనపై బీజేపీ నేత కె. లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలపై రేవంత్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. అవి అవగాహన లేని వ్యాఖ్యలని, లక్ష్మణ్ ఎలా డాక్టర్ అయ్యారో అర్థం కావడం లేదని ఘాటుగా విమర్శించారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగినా భౌగోళికంగా గ్యాప్ అలాగే ఉంటుందని, ఈ విషయంలో తెలంగాణను తెలివిగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. సీట్ల పెంపు విషయంలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అన్నారు. కేంద్రానికి కేవలం ఐదు ఉత్తరాది రాష్ట్రాల సీట్లు సరిపోతాయని, అదే జరిగితే దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సీట్ల పెంపులో ఈ వ్యత్యాసం కొనసాగితే భవిష్యత్తులో బండి సంజయ్, కిషన్ రెడ్డి వంటి నేతలకు రాజకీయంగా అవకాశాలు ఉండవని, దేశంలో నియంత పోకడలు పెరుగుతాయని సెటైర్లు వేశారు.

## అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఆపాలంటూ అసెంబ్లీలో తీర్మానం..

యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని.. ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు. యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పుడు ఆగకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ - ఇరాన్ యుద్ధాన్ని ఖండిస్తున్నామని.. ఆయా దేశాల మధ్య శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు భట్టి విక్రమార్క.

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పవన్ కల్యాణ్ వంటి నేతల పాత్ర కీలకమని, ఆయన తోడ్పాటుతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని చంద్రబాబు తన సందేశంలో స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఉన్న సమన్వయం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

వీరిలో 27,447 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. సాధారణంగా వారాంతాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండి, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోతుంటాయి. అయితే, వారాంతం ముగియడంతో ప్రస్తుతం రద్దీ కాస్త అదుపులో ఉంది. భక్తులు తక్కువ సమయంలోనే దర్శనం చేసుకుంటున్నారు.

## ఆ చారిత్రక తప్పిదం ప్రభుత్వం చేయొద్దు..
## మండలిలో ఎమ్మెల్సీ విజయశాంతి ఫైర్




ప్రత్యే రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారుల సంక్షేమంపై శాసన మండలిలో ఎమ్మెల్సీ విజయశాంతి తన వాయిస్ వినిపించారు. ప్రభుత్వంపై ఉన్న బాధ్యతను గుర్తు చేస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇవాళ ఆమె సభలో మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారులు లేకపోతే, ఇవాళ రాష్ట్రంలో ముఖ్యమంత్రులు కానీ, మంత్రులు కానీ ఉండేవారా అని ప్రశ్నించారు. పదవుల కంటే ముందు వారి త్యాగాలను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలతో పాటు వివిధ సందర్భాల్లో ఉద్యమకారులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం తప్పనిసరిగా నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

### చారిత్రక తప్పిదం చేయవద్దు..

ఉద్యమకారులను ఆదుకోవడమనేది ప్రభుత్వ తప్పనిసరి బాధ్యత అని విజయశాంతి అన్నారు. ఆ బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం సక్రమంగా నిర్వర్తిస్తే అది చరిత్రగా నిలుస్తుంది.. లేని పక్షంలో వారిని నిర్లక్ష్యం చేస్తే మాత్రం అది చారిత్రక తప్పిదంగా మిగిలిపోతుందని హెచ్చరించారు. ఇప్పటికైనా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన గౌరవం, పునరావాసం కల్పించాల్సిన అవసరం ఉందని విజయశాంతి ప్రభుత్వానికి సూచించారు.

# 2029కి అందరికీ ఇళ్లు - 21 నెలల్లోనే రెండోసారి పంపిణీ

మొదటి పేజీ తరువాయి

ఈ ఇళ్లను నిర్మించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, అనగాని, పార్థసారథి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ 2.50 లక్షల మంది గృహప్రవేశాలు జరుగుతున్నాయంటే చరిత్ర అని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఇది రెండోసారి గృహప్రవేశాలు చేస్తున్నామని వెల్లడించారు. పేద కుటుంబానికి ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వ నిర్ణయమని తెలిపారు. 2029 వరకు ఇళ్లు లేని వారి ఇల్లు నిర్మించి ఇస్తామని తిరుపతి జిల్లాలో 15,659 ఇళ్లు నిర్మించి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో 5.50 లక్షల ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు కట్టించి ఇస్తామని చెప్పారు. మెత్తం డిసెంబర్‌లోపు 10 లక్షల ఇళ్లు పేదలకు కట్టించి అందజేస్తామని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### 2029కి అందరికీ ఇళ్లు - 21 నెలల్లోనే రెండోసారి పంపిణీ: సీఎం చంద్రబాబు

"రూ.174 కోట్లు లబ్ధిదారుల ఖాతాల్లో వేస్తాం. గత ప్రభుత్వ




నేతలు అర్బన్ కింద కేంద్రం ఇచ్చిన డబ్బులు దుర్వినియోగం చేశారు. అలానే గత ప్రభుత్వం రూ.816 కోట్లు అప్పు పెట్టింది. నివాసయోగ్యం కాని ప్రాంతాల్లో ఇళ్లు కట్టేందుకు వైఎస్సార్సీపీ ప్రభుత్వం యత్నించింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వం పేదలు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి కల్పించింది. చరిత్రలో వైఎస్సార్సీపీ లాంటి ప్రభుత్వాన్ని చూడలేదు. వీలైతే మంచి చేయాలి విధ్వంసం పనికిరాదు. నాలుగోసారి సీఎంగా పని చేస్తున్నానంటే ఇది ప్రజాభిమానం. ప్రజలను కించపరిచేలా దుష్ప్రచారాలు చేస్తే సహించం."- చంద్రబాబు, ముఖ్యమంత్రి ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం: కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశామని 63 లక్షల మందికి మొదటి తేదీనే పింఛన్లు ఇస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తున్నామని అలానే స్త్రీశక్తి కింద మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని వెల్లడించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమం అందిస్తున్నామని పేర్కొన్నారు. అదే విధంగా పోలవరాన్ని గత ప్రభుత్వం నాశనం చేసిందని మండిపడ్డారు. గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. అనకాపల్లిలో స్టీల్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని దాని ద్వారా లక్షలమందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. హైదరాబాద్, చెన్నై కంటే అమరావతిని నెంబర్ వన్‌లో నిలబెడతామని సీఎం చంద్రబాబు అన్నారు. సుపరిపాలన అందించేందుకు కృషి చేస్తున్నామని అలానే సాంకేతికత ఎప్పటికప్పుడు అనుసంధానం చేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. అమరావతి రాజధానిపై తీర్మానం చేసి కేంద్రానికి పంపామని చట్టం రూపుదాల్చాక రాజధానిని ఎవరూ కదల్చలేరని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ నుంచి ఆకస్మిక తనిఖీలకు శ్రీకారం చుడుతున్నానని బాగా పనిచేసిన అధికారిని అభినందిస్తానని తెలిపారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజల్లోనే అడుగుతానని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేస్తేనే సత్ఫలితాలు వస్తాయని సీఎం చంద్రబాబు తెలిపారు.

# సైనికులకు న్యాయం సులభంగా అందాలి

మొదటి పేజీ తరువాయి

న్యాయస్థానాలు రాజ్యాంగ విలువలను కాపాడుతుండగా, ఆ ఆదర్శాలు నిలబడటానికి అవసరమైన పరిస్థితులను సైనికులే సృష్టిస్తారని పేర్కొన్నారు. అలాగే 1962 నాటి రెజాంగ్ లా యుద్ధాన్ని సైతం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రస్తావించారు. మేజర్ శైతాన్ సింగ్ భాటి, 13 కుమావోన్ రెజిమెంట్‌కు చెందిన చార్లీ కంపెనీలోని 114 మంది సైనికుల త్యాగాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "రాజ్యాంగం హక్కులు, గౌరవం, సమానత్వం, న్యాయం గురించి మాట్లాడినప్పటికీ, దేశ ప్రజల కోసం ఆ వాగ్దానాలు నిలబడగలిగే పరిస్థితులను కల్పించిన పూర్తి ఘనత సైనికులకే దక్కుతుంది. ఒక దేశం తన సార్వభౌమత్వాన్ని, స్థిరత్వాన్ని, శాంతిని కాపాడుకోలేకపోతే, ఆ దేశం స్వేచ్ఛ, న్యాయం గురించి అర్థవంతంగా మాట్లాడలేదు. సైనికుల భూ వివాదాన్ని కూడా ఎదుర్కోవచ్చు. ఒక మాజీ సైనికుడు సర్వీసు లేదా సంక్షేమ హక్కుల కోసం ఇబ్బందులు పడొచ్చు. ఒక కుటుంబం పింఛనుకు సంబంధించిన జాప్యాలు, గృహ సమస్యలు, వైవాహిక కలహాలు సంబంధిత వ్యవహారాల్లో అధికార యంత్రాంగం ఉదాసీనతతో వ్యవహరించొచ్చు. దేశం తన సైనికులను ఒకేసారి రెండు యుద్ధాలు చేసే స్థితిలో ఎన్నడూ ఉంచకూడదు. చట్టం సైనికుడి వద్దకే వెళ్లాలి. ఎందుకంటే సైనికుడు ఎల్లప్పుడూ చట్టం వద్దకు వెళ్లలేడు. సైనికులకు న్యాయం సులభంగా అందాలి" అని సీజేఐ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు.

### 'దేశాన్ని కాపాడేవారికి న్యాయ సహాయం అందించాలి'

ఇది కేవలం సైనికుల సానుభూతికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, ఒక రాజ్యాంగ విధి అని సీజేఐ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. దేశ సమగ్రతను కాపాడే వారికి ప్రభుత్వ సంస్థలు సకాలంలో న్యాయ సహాయం అందించాలని పేర్కొన్నారు. అలా చేయలేకపోతే ప్రభుత్వ సంస్థలు తమ నైతిక, రాజ్యాంగ బాధ్యతలను నిర్వర్తించడంలో విఫలమైనట్లేనని అభిప్రాయపడ్డారు. తాను నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యనిర్వాహక అధిపతిగా ఉన్నప్పుడు రక్షణ సిబ్బంది, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులు, పారామిలిటరీ దళాలు, సీఏపీఎఫ్ సభ్యులకు ఉచిత న్యాయ సహాయం, తోడ్పాటు, మద్దతు సేవలను అందించడానికి ప్రారంభించిన 'వీర్ పరివార్ సహాయ యోజన'ను ఈ సందర్భంగా సీజేఐ ప్రస్తావించారు. నల్సా కార్యనిర్వాహక ఛైర్మన్‌గా తాను ఉన్నప్పుడు సాయుధ దళాల కోసం ఈ పథకాన్ని రూపొందించి, అమలు చేయడం తన కెరీర్‌లోని గొప్ప ఘట్టాలలో ఒకటని అన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 14,929 మంది లబ్ధిదారులకు సహాయం అందించామని, 34 రాజ్య సైనిక్



బోర్డులు, 404 జిల్లా సైనిక్ బోర్డులతో సహా 438 న్యాయ సేవల క్లినిక్‌లను కార్యాచరణలోకి తెచ్చామని వెల్లడించారు. 'వీర్ పరివార్ సహాయ యోజన' కింద సేవలందించేందుకు విశ్వాసం, సానుభూతి సంస్కృతిని పెంపొందించేందుకు రక్షణ రంగ నేపథ్యం ఉన్న 378 మందితో సహా మొత్తం 1,123 మంది సిబ్బందిని నియమించినట్లు సీజేఐ సూర్యకాంత్ తెలిపారు. ఈ పథకం కింద ఆస్తి వివాదాలు, పెన్షన్ ఆలస్యం మొదలుకొని వైవాహిక కలహాలు, పాఠశాల ప్రవేశాల వరకు పలు సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సైనికులు సరిహద్దుల్లో ఉండి దేశాన్ని కాపాడుతున్నారని కొనియాడారు. ఃకుల ప్రయోజనాలన్నింటినీ పట్టుదలతో కాపాడటం దేశ సంస్థల కర్తవ్యమని అభిప్రాయపడ్డారు.

# అసోంలో ఒకప్పుడు అస్థిరత, అశాంతి- గత దశాబ్ద కాలంలో అన్నీ మారిపోయాయ్

మొదటి పేజీ తరువాయి

బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం శాంతి స్థాపన కోసం కృషి చేయడంతో పరిస్థితులు మారాయని పేర్కొన్నారు. ఈశాన్య ప్రాంతంలో వివిధ సంస్థలతో 12 శాంతి ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. ఒక రాష్ట్ర అభివృద్ధికి శాంతి అత్యవసరమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. గత పదేళ్లలో నిజాయితీగా అమలు చేసిన శాంతి ఒప్పందాల వల్ల అసోంలో స్థిరత్వం నెలకొన్నట్లు చెప్పారు. యువత భవిష్యత్తు భద్రత కోసం బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పై విమర్శలు

మునుపటి కాంగ్రెస్ ప్రభుత్వాలు కేవలం వార్తల్లో నిలిచేందుకు ఒప్పందాలు చేసేవని మోదీ విమర్శించారు. ఆ ఒప్పందాలు కాగితాలకే పరిమితమయ్యాయని, యువతను నిరాశలోకి నెట్టాయని అన్నారు. బోడో సమస్య సహా అనేక అంశాల్లో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో తిరుగుబాటుదారులు, విద్యార్థి సంఘాలతో చేసుకున్న ఏ ఒప్పందమూ ఫలించలేదని విమర్శించారు.

### మొదటిసారి ఓటర్లకు పిలుపు

మొదటిసారి ఓటు వేయనున్న యువతకు గత కాంగ్రెస్ ప్రభుత్వాల దుష్పరిపాలన గురించి గుర్తు చేయాలని పార్టీ కార్యకర్తలకు ప్రధాని మోదీ సూచించారు. చిన్న తప్పిదం కూడా రాష్ట్రాన్ని మళ్లీ వెనక్కి నెడుతుందని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న ఏఐ రూపొందించిన వీడియోలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అలాగే అసోంలో ఈసారి కూడా హ్యాట్రిక్ విజయం లక్ష్యంగా పనిచేస్తున్నట్లు మోదీ తెలిపారు.

### బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతించింది కాంగ్రెస్ : నితిన్ నబీన్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశీయులను అసోంలోకి అక్రమంగా ప్రవేశించేందుకు సహకరించిందని బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అక్రమ వలసలను నియంత్రించలేదని, దీంతో బంగ్లాదేశీ చొరబాటుదారులు అసోంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించారని అన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితిని మార్చి అక్రమ వలసదారులకు నిష్క్రమణ చూపిస్తున్నామని తెలిపారు. మోరిగావ్ జిల్లాలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు.

### రాహుల్ గాంధీపై నబీన్ విమర్శలు

సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీపై కూడా నితిన్ నబీన్ విమర్శలు గుప్పించారు. దిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో అసోం సంప్రదాయ కండువా గమోచాను ధరించలేదని, ఇది రాష్ట్ర ప్రజల భావాలను దెబ్బతీసిందని అన్నారు. అదే సమయంలో మసీదులకు వెళ్లినప్పుడు టోపీ ధరిస్తారని ఆరోపించారు.

### 'బీజేపీ పాలనలో అభివృద్ధి'

గత పది సంవత్సరాల్లో బీజేపీ పాలనలో అసోంలో భారీ అభివృద్ధి జరిగిందని నబీన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తీవ్రవాదం, హింస, పెట్టుబడిదారుల వెనుదిగడం, యువత నిరాశ వంటి సమస్యలు ఉండేవని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ప్రజలు జాగ్రత్తగా నిర్ణయం తీసుకోవాలని పిలుపునిచ్చారు.

### ఏప్రిల్ 9న అసోం అసెంబ్లీ ఎన్నికలు

అసోంలో 126 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు ఉంటుంది. 2016 నుంచి బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అక్కడ అధికారంలో ఉంది. హ్యాట్రిక్ కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ఈసారి అసోంలో అధికారాన్ని చేపట్టాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేస్తోంది.

# బీజేపీ, ఎల్‌డీఎఫ్ కుమ్మక్కు వల్లే శబరిమలపై మోదీ మౌనం

మొదటి పేజీ తరువాయి

మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి కలిసి పనిచేస్తున్నందు వల్లే ఇలా జరిగిందని ఆయన ఆరోపించారు. మతం కంటే రాజకీయాలకు ప్రాధాన్యతను ఇచ్చినందు వల్లే, శబరిమల అంశాన్ని ప్రసంగంలో మోదీ ప్రస్తావించలేదన్నారు. శబరిమలలో ఏం జరిగిందో మర్చిపోయినట్లుగా మోదీ వ్యవహరించారని రాహుల్ విమర్శించారు. అధికార వామపక్ష కూటమి నేతలు అయ్యప్ప ఆలయం బంగారాన్ని స్వాహా చేసి దాని స్థానంలో ఇత్తడిని పెట్టారనే విషయాన్ని ప్రధాని మర్చిపోయారని ఆయన వ్యాఖ్యానించారు. అయ్యప్ప ఆలయానికి నెలవైన పాలక్కడ్ జిల్లాకు వచ్చినప్పుడు శబరిమల గురించి మాట్లాడకపోవడం సరికాదన్నారు. యూడీఎఫ్ కూటమి అధికారంలోకి వస్తే అయ్యప్ప ఆలయంలో జరిగిన అక్రమాలతో సంబంధమున్న వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సోమవారం కేరళలోని పథనంతిట్ట జిల్లా అదూర్‌లో జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం

"ఈసారి కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ - సీపీఎంలతో కూడిన ద్వయాన్ని కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటోంది. ఈదఫా బీజేపీ పూర్తి మద్దతును కలిగిన వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమితో మేం పోరాడుతున్నాం. ఒక వైపు కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ కూటమి ఉంది. మరోవైపు సీపీఎం - బీజేపీల ద్వయం ఉంది. ఎల్‌డీఎఫ్ కూటమిలో బీజేపీ రహస్య హస్తం దాగి ఉంది. సాధారణంగా రహస్య హస్తం లాంటి కాన్సెప్ట్‌లను మార్కెట్లతో ముడిపడిన ఆర్థికవేత్తలు వినియోగిస్తుంటారు. కేరళలో కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని బీజేపీ కోరుకుంటోంది. ఎందుకంటే జాతీయ స్థాయిలో బీజేపీకి సవాల్ విసురుతున్న ఏకైక రాజకీయ శక్తి కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లతో మేం సైద్ధాంతికంగా పోరాడుతున్నాం. ఎల్‌డీఎఫ్ లాంటి కూటమి కేరళలో అధికారంలో ఉన్నా, తమ నియంత్రణలోనే పని చేస్తుందని బీజేపీ భావిస్తోంది. బీజేపీ నియంత్రణలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ఉన్నందు వల్లే సీఎం పినరయి విజయన్‌పై ఒక్క కేసూ నమోదు కాలేదు. బీజేపీపై సీఎం పినరయి విజయన్ పల్లెత్తు మాట కూడా అనలేదు. బీజేపీ- ఎల్‌డీఎఫ్ కుమ్మక్కుకు ఇవే నిదర్శనాలు" అని రాహుల్ గాంధీ తెలిపారు.

కేరళ సీఎంను ఎందుకు టార్గెట్ చేయడం లేదు?

"కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ దేశంలోని విపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పోరాడినా దర్యాప్తు సంస్థల ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. అందుకే నాపైనా 36 కేసులను నమోదు చేశారు. నన్ను కంటిన్యూగా 55 గంటల పాటు ప్రశ్నించారు. కానీ కేరళలోని వామపక్ష ఎల్‌డీఎఫ్ కూటమి అధినాయకత్వంపై అలాంటి దర్యాప్తుల ఒత్తిడేం లేదు. కేరళ సీఎంను కానీ, అధికార ఎల్‌డీఎఫ్ కూటమి నేతలను కానీ కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకో టార్గెట్ చేయడం లేదు" అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.

దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు!

"నేను ఈ ప్రసంగాన్ని మొదలుపెట్టేటప్పుడే మైక్ వైపు చూశాను. ఇదిగో దానిపై మేడ్ ఇన్ చైనా అని రాసి ఉంది. ఇండియాలో తయారైంది, కేరళలో తయారైంది అని దీనిపై ఎందుకు రాసిలేదు? మేడ్ ఇన్ ఇండియా వస్తువుల తయారీ అనేది లేకుండా మనం కేరళ యువత కోసం ఉద్యోగ అవకాశాలను ఎలా క్రియేట్ చేయగలం? కేరళ భవిష్యత్తును కేవలం 1 లేదా 2 కంపెనీలే కంట్రోల్ చేస్తే, మేడిన్ ఇండియా లక్ష్యాన్ని మనం ఎలా సాకారం చేసుకోగలం? మీ ముఖ్యమంత్రి, ప్రధానమంత్రే ఈ దేశాన్ని అదానీ, అంబానీల చేతుల్లో పెడుతున్నారు. కేరళలోని వామపక్ష ప్రభుత్వమే కమ్యూనిస్టు భావజాలాన్ని అణచివేస్తోంది. దీంతో అది కార్పొరేట్ ఫండెడ్ ప్రభుత్వంగా మారిపోయింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ రాజీకి వచ్చినట్టుగా, నరేంద్రమోదీతో సీఎం పినరయి విజయన్ రాజీకి వచ్చారు. అవినీతి అభియోగాల ద్వారా విజయన్‌ను మోదీ కంట్రోల్ చేస్తున్నారు" అని రాహుల్ గాంధీ ప్రశ్నలు సంధించారు.

## తుపాన్లకు "పంట" అదరదు - "వరి" నేలరాలదు - రైతుల ప్రయోజనకారిగా ఈ వంగడం!

స్వర్ణ వరికి ప్రత్యామ్నాయం - గాలులు, వర్షాలకు తట్టుకుని నిలిచే వరి వంగడం!

ఢిల్లీ : దేశంలో పండే అతి ముఖ్యమైన పంటల్లో వరి ఒకటి. ఈ సాగులో విప్లవం కొత్త పుంతలు తొక్కుతోంది. ఇందులో భాగంగానే ప్రతికూల పరిస్థితులు తట్టుకుని అధిక దిగుబడులతో పాటు రైతుల ఆదాయాలు పెంచే కొత్త వంగడాలపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. కానీ కొన్నిసార్లు ఊహించని వాతావరణ పరిస్థితులు, తుపాన్ల ధాటికి పంట నేలవాలి అన్నదాతలకు కోలుకోలేని నష్టం వాటిల్లుతోంది. ఫలితంగా కర్షకులు సాగు చేయాలంటే వెనకడుగు వేసే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే తుపాన్లను తట్టుకుని దీటుగా నిలబడే సరికొత్త వంగడాన్ని శాస్త్రవేత్తలు రూపొందించి అందుబాటులోకి తెచ్చారు. దీనిని రైతులకు ఇచ్చి సాగు చేయించగా మంచి దిగుబడులు వచ్చాయి. అంతేకాక చీడపీడలను తట్టుకుని నిలబడింది. మరి అసలేంటి ఈ కొత్త రకం వంగడం? దీని ప్రత్యేకతలేంటో ఇప్పుడు తెలుసుకుందామా? ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో మార్టేరు పరిశోధన కేంద్రం పనిచేస్తుంది. అన్నదాతలకు మేలైన వరి వంగడాలు, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఇది కృషి చేస్తుంది. మార్టేరు పరిశోధన కేంద్రంలో పురుడు పోసుకున్న వంగడాలే దేశంలో 25 శాతం, ఆంధ్రప్రదేశ్ లో 80 శాతం సాగవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వరి సాగులో రైతుల ప్రయోజనకారిగా ఉండేలా తుపాన్లను తట్టుకుని దీటుగా నిలబడే ఎంటీయూ 1318 రకం వంగడాన్ని విడుదల చేశారు. ఈ మేరకు 2020లో మినీ కిట్లు ఇచ్చి అన్నదాతలతో సాగుచేయించగా మంచి ఫలితాలొచ్చాయి. ఈ రకాన్ని 2022 నుంచి అందుబాటులోకి తెచ్చారు. తుపాన్లను తట్టుకుని దీటుగా నిలబడి మంచి దిగుబడులు ఇస్తుండటంతో దీని సాగుకు కర్షకులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఖరీఫ్‌లో శ్రీకాకుళం నుంచి గుంటూరు వరకు ఆరు లక్షల ఎకరాల్లో ఎంటీయూ 1318 రకాన్ని పండించారు.

మొంథాను తట్టుకుని : గతేడాది వచ్చిన మొంథా తుపాను శ్రీకాకుళం, ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల్లో వరిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. దాదాపు 3 లక్షలకుపైగా ఎకరాల్లో పంట దెబ్బతింది. కనీసం ఎకరాకు 15 నుంచి 20 బస్తాల దిగుబడికి నష్టం వాటిల్లింది. ఇలాంటి ప్రకృతి విపత్తులను దృష్టిలో ఉంచుకుని స్వర్ణ స్థానంలో ఇతర రకాలను అన్నదాతలను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఎంటీయూ 1318ని గోదావరి, కృష్ణ జిల్లాల్లో 5 లక్షల ఎకరాలకుపైగా సాగు చేశారు. మొంథా తుపాను తీవ్ర అలజడి సృష్టించినా 90 శాతం పంట పడిపోకుండా నిలబడింది. ఈ మేరకు రెండు సంవత్సరాల సగటును పరిశీలిస్తే ఎకరానికి 35 నుంచి 40 బస్తాల దిగుబడి వచ్చింది. వర్షాలకు పంట నేలవాలక పోవడంతో అన్నదాతకు ఇతర ఖర్చులు తగ్గి ఎకరాకు రూ.20,000లు ఆదా అయింది. ఎకరాకు రూ.20,000ల చొప్పున లెక్కిస్తే 5 లక్షల ఎకరాల్లో గత ఖరీఫ్‌లో రూ.1000 కోట్ల నష్టం తప్పినట్లయింది. అధిక దిగుబడులూ సాధ్యం

# సంపాదకీయం

## నది అలలపై తెలుగు కవిత

నది గలగలల కన్నా గొప్ప సంగీతం ఉంటుందా. అలల సవ్వడిలో తడిసిపోని కవీ ఉండడు. నది చేసే గాయాలకూ నది చుట్టూ రాజకీయాలకూ కొదువ లేదు. నదిని దోసిట్లోకి తీసు కుంటే ఎన్ని పాటలో! నది పాడే పాటల్లో జీవం, జీవనం, గమనం, గమ్యం.. ఎన్నెన్ని చరణాలో! కలం నిండా నదిని నింపుకుని కవిత్వమై ప్రవహించిన కొన్ని చరణాలనైనా వినిపించాలని ఈ ప్రయత్నం. నదినీ జీవితాన్నీ ఒక తాత్విక చట్రంలో కలిపి చూపిన దాట్ల దేవదానంరాజు కవిత 'నాలోకి నదిని ప్రవహించనీయండి'లోని పంక్తులతో మొదలుపెడతాను: "నదీతీరం వెంట నడుస్తున్నపుడు/ నిదురించే నదిలోకి పడవెళ్లిపోతున్న దృశ్యం/ నీటిదారిలో వెండి జలతారు ముక్కలు/ నేనే నురగైపోతాను చేపపిల్లై చిందులేస్తాను./ జలకాలాటల సయ్యాటలు.// అలల నదిలో కలల ఒడి/ తడిసి వణుకుతున్న చంద్రబింబం/ నేనూ తడవకుండా మునకలేస్తాను./ ఆరని చెమ్మ ఊరిస్తుంటే/ నదీ ఆకాశం కలిసేచోటును కనుగొన్నాను." "పుడితే నదిగానే పుట్టాలి" అంటారు బెల్లి యాదయ్య 'నదీ.. చెట్టూ' కవితలో: "నదీ చెట్టూ తోబుట్టువుల్లా కన్పిస్తాయి నాకు/ ఘనాకార పచ్చదనం చెట్టు/ ప్రవహించే పత్రహరితం నది// చెట్టుకూ నదికీ మధ్య దర్జాగా నడిచే వసంతమే మనిషి," ఇలా నదినీ మనిషినీ అంటుకడతాడు కవి. "నదికీ ఒక భాష ఉంది" అన్నది గౌరునాయుడు మాస్టారి మాట: "నదికొక భాష ఉంది. నదికొక నాగరికత ఉంది. నదికొక బాధ్యతా ఉంది.// అక్షరాల్ని దిద్దినట్టు అలల్ని దిద్దుకోకపోతే, కెరటాలతో కరచాలనం చెయ్యకపోతే, లహరుల లయ విన్యాసాలను లోతుగా అధ్యయనం చేయకపోతే నది ఎప్పటికీ అర్థం కాదు". నాగావళి, వంశధారల యుగళ వేదన కంచరాన భుజంగరావు కవిత: "ఎక్కడెక్కడ ఏ రూపు చూపినా/ పారే నీళ్ళల్లో ప్రతిబింబాలన్నీ నాగధార కన్నీటి చారలే// అలల తూలికల్లోనే నిదురిస్తున్నా/ వలసదారుల రద్దు కలగంటూనే ఉంది నాగధార". నదీ కేంద్రంగా నడిచే రాజకీయాల్ని ఆక్రోశిస్తారు కవి జూలూరు గౌరీశంకర్: "కవి లోతు, నది లోతు బైటకు కనపడదు/ నా పక్కనుంచే నా కాళ్ళ ముంగిటనుంచే/ గలగలా పాక్కుంటూ పోయినవు/ నన్ను సవతికొడుకునే చేసింద్రు/ నీకు తెగిపడ్డ తల్లిపేగు రోదన తెలుసు/ ఈ బిడ్డకు పాలిచ్చిపోవే గోదావరీ// నువ్వు అవనికే అందానివే/ కానీ నాకు మట్టుకు/ మా నోటికి అన్నం పెట్టే/ నీళ్ళ కంచానివి కమ్మంటున్నా". నీటి ప్రాజెక్టుల మీద 'నీటి పువ్వు' కవితను రాసారు ఒద్దిరాజు: "నది అంటే నడుస్తున్న సంపద/ నీటిని మూట గట్టి/ పొలాల్లో విప్పితే/ అది సీతాకోక చిలుకల గుంపవుతుంది," అంటూనే నిధులు, నియామకాలు, నీళ్ళు నినాదాలుగా నడిచిన ప్రత్యేకరాష్ట్ర ఉద్యమస్ఫూర్తిని ఎగదోస్తారిలా: "నది ఒకప్పుడు మనకు ఎండమావి/ ఇప్పుడు మేడిగడ్డ నుంచి కన్నెపల్లి మీదుగా/ తరలివస్తున్న పాలపొదుగు/ నది ఒకప్పుడు చుట్టపు చూపు/ ఇవ్వాళ ఒట్టిపోయిన చెరువుల్లో/ జలసిరులు కురిపించే ప్రజల కలల నీటి పువ్వు". అనంత 'నదీ నిర్వేదముద్ర'ను వినిపిస్తాడు యువ కవిత్వకెరటం కొత్తపల్లి సురేష్: "రోజూ నేనొక నదిమీద కన్నీరై ప్రవహిస్తుంటాను; అది ఖాయిలా పడ్డ నది! నీటిచుక్క జాడలేని శుద్ధ స్మశానవీధి! ఆ బీదనదీ ఎదసొద వింటూ రోజూ నేనొక నదిమీద బధిరగానమై సాగుతుంటాను// నీళ్లను చూడడం నా సీమ కన్నుల వేడుక/ ఈ నేలకొక అపురూప దృశ్యభంగురం/ బండ్లు కట్టుకొని వెళ్లిచూసే నిషా ఇక్కడ నీళ్లంటే!/ జాతర ముగిసిన మూణ్ణాలకి/ గుండెపగుళ్ళ తీరాల నిశ్శబ్ద స్వరాలను వినే నదిది యథా నిర్వేదముద్ర!" సీమ కవి కొత్తపల్లిది నది కోసం కలవరింపు కాదు. "పేజీ లుగా రోజులను తోసుకుంటూ వెళ్లిన/ గుండెలను తడుపుకుంటూ వెళ్లిన నదీ,/ నీ చూపుల అలల తీరాలను తాకని/ యుగాల చెమట పాదాలపై ఒక్క చినుకువై కురిసిపో!" అని పూటకో సారైనా చెప్పుకునే నదీ పాఠం. మరో సీమ కవి మల్లెల నరసింహామూర్తి 'జల స్వప్నం' ఇప్పుడు 'మాకూ ఒక నది కావాలి' అనే సామూహిక ఆకాంక్షగా, రాజకీయ డిమాండ్‌గా మారింది. "కొన్ని యుద్ధాల్ని స్వప్నిస్తా. కేవలం నీళ్ళ గురించి, కొన్ని ఉద్యమాల్ని నిర్మిస్తా.

# చితికిపోతున్న రైతుల ఆశలు



టొమాటో రైతులకు కొన్నాళ్లుగా షాక్‌లు తప్పట్లేదు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో టొమాటోలు కుప్పలుగా పేరుకుపోయాయి. కొన్ని చోట్ల కిలో టొమాటో ధర ఆరు రూపాయలకు, అంతకంటే దిగువకు కూడా పడిపోయింది. దారుణమైన ఈ ధరలు రైతు శ్రమను అవమానించేవి మాత్రమే కాదు, వ్యవసాయ రంగానికి పెద్ద హెచ్చరికలు కూడా! ఏపీలోని చిత్తూరు-మదనపల్లె ప్రాంతం, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలు, కర్నూలు, తెలంగాణలోని బోయిన్‌పల్లి వంటి మార్కెట్లలో టొమాటో రైతుల కడగండ్లు కళ్లకుకట్టాయి. పాతిక కిలోల టొమాటో పెట్టె కొన్నిచోట్ల సుమారు రూ.200కు అమ్ముడైంది. అంటే రైతుకు లభించినవి కిలోకు పది రూపాయల కంటే తక్కువే. ముప్పై కిలోల పెట్టెకు నలభై-యాభై రూపాయలు కూడా పలకట్లేదని మరికొన్ని ప్రాంతాల్లో రైతులు కన్నీరుపెట్టుకున్నారు. ఎకరాకు రూ.60వేల నుంచి రూ.70వేలు పెట్టుబడి పెట్టిన రైతులు, ఈ ధరలతో సగం ఖర్చు కూడా రాబట్టుకోలేరు. ఇది రైతుల చేతిలో నగదు లభ్యతనూ, గ్రామీణ రుణచక్రాన్నీ, పల్లెల్లో ఉపాధినీ నేరుగా దెబ్బకొడుతుంది. ఇదే కథ ప్రతి సంవత్సరం ఎందుకు పునరావృతమవుతోంది? ప్రభుత్వాలు ఏటా టొమాటో ధర పతనమైనప్పుడల్లా తాత్కాలిక ఉపశమన చర్యలే ప్రకటిస్తున్నాయి. మరుసటి ఏడాది సంక్షోభం తిరగబెడుతోంది. సమస్య మూలాల్ని పరిష్కరించే వ్యవస్థాగత సంస్కరణలను ఎప్పుడు చేపడతారన్నదే మన ముందున్న కీలక ప్రశ్న!

**పూర్తిగా ప్రణాళికా లోపమే...**

టొమాటో త్వరగా పాడయ్యే పంట. కోత తరవాత 7-10 రోజులు మాత్రమే ఉంటుంది. సరఫరా అకస్మాత్తుగా పెరిగితే ధరలు పడిపోవడం మార్కెట్‌లో మామూలే. అయితే ఏటా అదే ప్రాంతాల్లో, అదే సమయంలో ఇలా జరగడం మాత్రం పూర్తిగా ప్రణాళికా లోపమే. ఈ సీజన్‌లో కూడా ఏపీలో చిత్తూరు, మదనపల్లె, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీగా వచ్చిన నిల్వలు మార్కెట్లను ముంచెత్తాయి. భారీ సరఫరాకు తగిన డిమాండ్ లేకపోవడంతో ధరలు పడిపోయాయి. ఒక సీజన్‌లో ధరలు ఎక్కువగా ఉంటే రైతులు తదుపరి సీజన్‌లో సాగు విస్తీర్ణాన్ని పెంచుతారు. ఫలితంగా దిగుబడి విపరీతంగా పెరిగి, అన్ని మార్కెట్లలో ధరలు ఒకేసారి పడిపోతాయి. మన దేశంలో 2024-25 సీజన్‌లో 21.07 లక్షల ఎకరాల్లో 215.49 లక్షల టన్నుల టొమాటో ఉత్పత్తి అయిందని అంచనా. మొత్తం ఉత్పత్తిలో 32.69 లక్షల టన్నులు మధ్యప్రదేశ్‌లో, 27.76 లక్షల టన్నులు కర్ణాటకలో, 20.76 లక్షల టన్నులు ఆంధ్రప్రదేశ్‌లో పండాయి. జాతీయ వాణిజ్య పంటగా మారిన టొమాటో విషయంలో ఉత్పత్తి పెరిగినంత వేగంగా నిల్వ, ప్రాసెసింగ్, సరఫరా సమన్వయ వ్యవస్థలు వృద్ధి చెందలేదు. ఫలితంగా బంపర్ పంట అనేది రైతుకు సిరులు కురిపించాల్సింది పోయి తీవ్ర ఆర్థిక నష్టాలకు కారణమవుతోంది. పశ్చిమభారత, దక్షిణాది రాష్ట్రాల్లో టొమాటో నాలుగు సీజన్లలో సాగవుతుంది. ఈ సీజన్లలో ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతాయి. దీన్ని ముందే అంచనా వేసి సంసిద్ధంగా ఉండకుండా, అంతా దైవాధీనం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ధరల పతనాన్ని కొందరు పూర్తిగా వ్యాపారులు, దళారుల మాయాజాలంగా అభివర్ణిస్తారు. కానీ, సమస్యకు మూలం మార్కెట్‌ను బంపరు పంట ముంచెత్తడమే. పొలాల దగ్గర ధరలు పడిపోయినా, నగరాల్లో చిల్లర ధరలు అదే స్థాయిలో తగ్గకపోవడానికి కారణం- సరఫరా గొలుసులోని లోపాలే. ఎక్కువమంది మధ్యవర్తులు ఉండటం, రవాణా ఖర్చులు, కోత అనంతర నష్టాలు, గ్రేడింగ్, సేకరణలో లోపాలు వంటివన్నీ కలిసి రైతు ఆదాయానికి గండి, వినియోగదారుడి జేబుకు చిల్లు పెడుతున్నాయి. ఈ క్రమంలో ధరల స్థిరీకరణకు, పంట నష్ట నివారణకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ 'టొమాటో గ్రాండ్ ఛాలెంజ్'ను ప్రారంభించింది. దీనికింద 28 ప్రాజెక్టులను చేపట్టారు. టొమాటో నిల్వ కాలాన్ని పెంచే సాంకేతికతల వ్యాప్తి, స్మార్ట్ ప్యాకేజింగ్, మార్కెట్ ఇంటెలిజెన్స్ సాధనాలు, నిల్వ, ప్రాసెసింగ్ పరిష్కారాలపై దృష్టి పెడుతున్నారు. ఈ ప్రతిపాదనలు అమలుకు నోచుకోవాలి. టొమాటోను ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు, కోత ఎప్పుడు వస్తుంది అనే కచ్చితమైన సమాచారం లేకపోవడంతో ప్రభుత్వాలు, మార్కెట్లు ఆలస్యంగా స్పందిస్తున్నాయి. టొమాటోలను ప్యూరీ, పేస్ట్‌గా మార్చే లేదా ఎండబెట్టే ప్రాసెసింగ్ యూనిట్లు ప్రధాన సాగు ప్రాంతాల్లో తగినంతగా లేవు. ధర విషయంలో బేరమాడే శక్తి వ్యక్తిగతంగా రైతులకు ఉండదు. అలాంటప్పుడు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పీవోలు) ధరల స్థిరీకరణకు తోడ్పడగలవు.

**సాగుదారుల క్షేమమే లక్ష్యంగా...**

రైతులకు ముందుగా వాతావరణ అంచనాలు, నర్సరీ విక్రయాలు, సాగు విస్తీర్ణం డేటాపై సలహాలు ఇవ్వాలి. టొమాటో సాగు ఎక్కువగా ఉండే చోట్ల క్లస్టర్ స్థాయి శీతలీకరణ సదుపాయాలను నిర్మించాలి. దిగుబడి ఎక్కువగా ఉన్నప్పుడు అదనపు ఉత్పత్తిలో 10 నుంచి 20 శాతాన్ని ప్యూరీ, పేస్ట్‌గా మార్చగల ప్రాసెసింగ్ యూనిట్లను నెలకొల్పాలి. ఎఫ్‌పీవోలను గ్రేడింగ్, లాజిస్టిక్స్, మార్కెటింగ్ చేయగల వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దాలి. ఉత్పత్తి, ధరలు, నిల్వ సామర్థ్యాన్ని నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థను తెలుగు రాష్ట్రాలు ఏర్పాటు చేసుకోవాలి. పరిశోధనలు కేవలం దిగుబడిని పెంచడంపైనే కాకుండా, ధరల్లో హెచ్చుతగ్గులను నియంత్రించే సాంకేతికతలపైనా దృష్టి సారించాలి. ఎక్కువ కాలం నిల్వ ఉండి, రవాణాకు తట్టుకునే రకాలను, వేర్వేరు సమయాల్లో కోతకు వచ్చే రకాలను, ప్రాసెసింగ్‌కు అనువైన రకాలను రూపొందించాలి. టొమాటో ధరల సంక్షోభం ప్రకృతి వైపరీత్యం కాదు- ప్రణాళిక లేని సాగు వల్ల వచ్చిపడుతున్న వైపరీత్యం. మార్కెట్ వ్యవస్థను విస్తరించకపోతే అధిక ఉత్పత్తి రైతుకు నష్టాలనే మిగుల్చుతుంది. డిజిటల్ పంట ప్రణాళికలు, కోల్డ్ చైన్, ప్రాసెసింగ్ బఫర్లు, బలమైన ఎఫ్‌పీవో మార్కెటింగ్ యంత్రాంగాలను సిద్ధంచేసుకోవడం అవసరం. అప్పుడే టొమాటో రైతులు మార్కెట్ యార్డులకు భయంతో కాకుండా నమ్మకంతో వస్తారు. లేదంటే, వచ్చే ఏడాది కూడా ఇలాంటి పరిస్థితే ఎదురవుతుంది!

# ఇరుక్కుపోయిన అమెరికా!



ఇరాన్‌లో ప్రభుత్వాన్ని పడగొట్టాలనేది అమెరికా లక్ష్యం. వివిధ జాతుల వారిని వాడుకుని ఇరాన్‌ను దెబ్బతీయాలని అగ్రరాజ్యం ఎత్తులు వేసింది. కానీ, అవి వికటించడంతో ఎదురుదెబ్బలే మిగిలాయి. తప్పుడు అంచనాల ఫలితంగా తాను సృష్టించిన సంక్షోభంలో తానే చిక్కుకుపోయింది. పరిమిత నష్టంతో బయటపడేందుకు అమెరికా ఇప్పుడు నానా తంటాలు పడుతోంది. ఎంతోకాలంగా ఇరాన్ ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్న వివిధ జాతులు సరైన అవకాశం కోసం ఎదురు చూస్తున్నాయి. వాటిలో ఇరానియన్ కుర్దుల గ్రూపు ఒకటి. పరాక్రమవంతులుగా వీరికి పేరుంది. సిరియాలో ఐఎస్ఐఎస్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు అమెరికా సైన్యమే కుర్దులకు శిక్షణ ఇచ్చింది. దేశంలోపల, వెలుపల కూడా ఇరాన్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనేందుకు వారు సిద్ధమయ్యారు. టెహ్రాన్‌లోని సుప్రీంలీడర్‌ను హతమారిస్తే నాయకత్వ శూన్యత ఏర్పడుతుందని, తత్ఫలితంగా ఇరాన్ బలహీనపడితే, తమ అజెండాకు మద్దతు ఇచ్చే విభిన్న జాతుల జోక్యంతో పరిస్థితులు సామూహిక తిరుగుబాటుకు దారితీస్తాయని అగ్రరాజ్యం ప్రాథమికంగా తలపోసింది. కానీ, అదేదీ నిజం కాలేదు. అప్పటిదాకా ప్రజాదరణ కొరవడిన ఇరాన్ ప్రభుత్వం, యుద్ధం కారణంగా ప్రజల మద్దతును సంపాదించుకోగలిగింది. దాంతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ ప్రాంతంలోని అనుకూల పక్షాలతో కలిసి భూతల దాడులను మొదలుపెట్టాలనే దిశగా ఆలోచిస్తున్నాయి.

కుర్దులు, బలూచ్‌ల సాయంతో...

ఇరాన్ జనాభాలో పదిశాతందాకా ఉండే కుర్దులు- ఇస్లామిక్ ప్రభుత్వాన్ని కూలదోయాలని ఎంతోకాలంగా ప్రయత్నిస్తున్నారు. ఇంతకుముందు సిరియాలో ఐఎస్ఐఎస్‌ను తరిమికొట్టడంలో భాగంగా ఐఆర్‌జీసీ సైనికులకు వ్యతిరేకంగా పరోక్ష పోరాటం చేశారు. ఆ అనుభవంతో కుర్దిష్ పెష్మెర్గా (మృత్యుదళం) ఇరాన్ బలగాలకు వ్యతిరేకంగా భూతల యుద్ధం చేసేందుకు సరిహద్దులు దాటేందుకు సిద్ధంగా ఉంది. తుర్కియే, ఇరాన్‌ల మధ్య నలిగిపోయి, తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యామనే అసంతృప్తితో ఉన్న కుర్దులు, ఈ దాడుల్లో పాల్గొంటే తమకు భారీ ప్రతిఫలం దక్కుతుందని ఆశిస్తున్నారు. కుర్దుల తరవాత ఇరాన్‌పై పోరాడేందుకు బలూచ్‌లను వాడుకోవాలని అమెరికా యోచిస్తోంది. వీరు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాటం చేస్తున్నారు. అయితే, ఇరాన్‌పై భూతల దాడుల కోసం బలూచ్‌లు లేదా కుర్దులను రంగంలోకి దింపితే ఆ ప్రాంతమంతా గందరగోళం చెలరేగిపోయే ప్రమాదం ఉంది. అఫ్గానిస్థాన్ యుద్ధంలో అమెరికా ఇలాగే అక్కడి రెండో ప్రధాన వర్గమైన హజారస్‌కు శిక్షణ ఇచ్చి తాలిబన్లకు వ్యతిరేకంగా ఉసిగొల్పింది. వారు ఇరవై ఏళ్లకుపైగా పరస్పరం దాడులు చేసుకున్నారు. చివరికి అమెరికా వెనుదిరిగాక అస్థిరమైన శాంతి ఒప్పందం చేసుకున్నారు. అగ్రరాజ్యం ఏమో ఒకప్పుడు తాను ఉగ్రవాదులుగా ముద్రవేసిన తాలిబన్లతోనే ఒప్పందం చేసుకుని, పాలనను వారికి అప్పగించింది. తాలిబన్లు తమ శ్రేణులను ప్రాథమికంగా మత పాఠశాలల నుంచి తీసుకుంటారు. అదేవిధంగా, ఇరాన్ ప్రభుత్వం తన బలగాల్లో ఎక్కువ మందిని స్థానికంగా ఉన్న రెండు ప్రధాన మత కేంద్రాల నుంచి చేర్చుకుంటుంది. మతసంస్థలకు నిధులు సమకూర్చే వాణిజ్య వర్గాల్లో ఇరాన్ ప్రభుత్వం బలమైన పట్టును కొనసాగిస్తుంది. కాబట్టి స్థానిక భూభాగాలపై గట్టి పట్టు ఉన్న కుర్దిష్‌లు రంగంలోకి దిగినా భూతల పోరాటం అంత తేలికేమీ కాదు. దీర్ఘకాలంగా పాకిస్థాన్‌పై పోరాడుతున్న బలూచ్‌లు అమెరికా మద్దతును ఆశిస్తున్నారు. గతంలో 'సీపెక్'ను వ్యతిరేకించి, చైనా ఇంజినీర్లపై పలుమార్లు దాడులు కూడా చేశారు. అలా వారు అమెరికా దృష్టిలో పడినా, పాకిస్థాన్ ఆగ్రహానికి గురయ్యారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా బలూచ్ యోధులను వాడుకోవాలంటే, ప్రతిగా అమెరికా వారికేదైనా హామీ ఇవ్వాల్సిందే. అలా ఏదైనా వాగ్దానం చేస్తే, పాకిస్థాన్‌ను దూరం చేసుకోవాల్సి వస్తుంది. మరోవైపు, భూతల యుద్ధంలో బలూచ్‌లను దింపే విషయంలో ఇజ్రాయెల్‌కు మాత్రం ఇలాంటి సమస్యలు లేవు.

సొంత సైన్యాలను పంపినా...

సుప్రీంలీడర్ మరణంతో ఇరాన్ విచ్ఛిన్నమవుతుందని అమెరికా ఊహించింది. అక్కడి అసంతృప్త వర్గాలన్నీ వీధుల్లోకి వస్తాయని, ప్రభుత్వాన్ని కుప్పకూలుస్తాయని భావించింది. అయితే, వాస్తవంలో అందుకు విరుద్ధంగా జరిగింది. ఇరాన్ నుంచి ప్రస్తుతం ఎదురవుతున్న ప్రతిఘటననూ అమెరికా ఊహించలేదు. ఇరాన్‌లోని సంక్లిష్ట భౌగోళిక పరిస్థితుల్లో భూతల యుద్ధమైతే మరీ కష్టం. అమెరికా, ఇజ్రాయెల్‌లు అందుకు తమ సొంత సైన్యాలను పంపించాలనుకున్నా, వ్యూహాత్మకంగా అది సరైన ఎత్తుగడ కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. భూతల యుద్ధం చేయకుండా, ప్రజాందోళనలు లేకుండా ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చడం అంత సులభతరమేమీ కాదు. ఇరాన్ తన మనుగడ కోసం పోరాడుతుండగా, అమెరికా మాత్రం స్వప్రయోజనాలపై తప్పుడు అంచనాలతో తాను తీసుకున్న గోతిలో తానే పడింది. ఇప్పుడు ముందుకూ కదల్లేక, వెనక్కి వెళ్లలేని సంకటస్థితిలో కూరుకుపోయింది.

# గిరిజన రైతాంగ ఉద్యమం తెలంగాణపై తీవ్ర ప్రభావం

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నక్సల్స్ రహిత భారతదేశం గడువు మార్చి 31తో ముగుస్తుంది. కేంద్ర ప్రభుత్వం నక్సల్స్‌కు పెట్టిన డెడ్‌లైన్ మరో రెండు రోజులే మిగిలి ఉన్నది. ఆరు దశాబ్దాల క్రితం ఆరంభమై 22 రాష్ట్రాలకు విస్తరించి రోజూ ఎక్కడో చోట ఉద్యమ ఆనవాళ్లు ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లా నక్సల్బరీ సమీపంలోని బెంగాయిజోట్ గ్రామంలో 1967లో 25 మేన జరిగిన భూఉద్యమ పోరాటంలో జరిగిన పోలీస్ కాల్పుల్లో తొమ్మిది మంది కార్మికులు, ఇద్దరు పిల్లలు మరణించడంతో నక్సలిజం మొదలైంది. అలా భూపోరాటం, సగటు మనిషికి కూడు, గూడు, గుడ్డ, గుప్పెడు న్యాయం నినాదంతో జనంలోకి వెళ్లింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ 1975 వరకు వేళ్లూనుకునే ఉన్నది. దొరలు, భూస్వాములు పటేల్, పట్వారీ వ్యవస్థల దోపిడీ విధానాల వల్ల ప్రజలు ఆర్థిక, మానసిక, శారీరక అసమానతలకు గురవుతున్న రోజులవి. అదే సమయంలో 1967లో పశ్చిమ బెంగాల్‌లో చారు మజుందార్, కానూ సన్యాల్ సీపీఎం నుంచి విడిపోయి నక్సల్‌బరి నుంచి ఉద్యమం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఎం నాయకులు దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, కొల్లా వెంకటయ్య తదితరులు నక్సలైట్ ఉద్యమాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విస్తరింపజేశారు. 1969లో జరిగిన శ్రీకాకుళం గిరిజన రైతాంగ ఉద్యమం తెలంగాణపై తీవ్ర ప్రభావం చూపింది. 1969లో జరిగిన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి సమర్థించారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం వందలాది మంది తెలంగాణ ఉద్యమకారులను కాల్చి చంపింది. తెలంగాణ పర్యాటకం తెలంగాణ ఉద్యమంలో చెన్నారెడ్డి నాయకత్వ వైఫల్యంతో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహంతో ఉన్న తెలంగాణ యువత విప్లవోద్యమాలవైపు ఆకర్షితమైంది. 1969-70 నుంచే తెలంగాణలోని వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తి, డాక్టర్ కొల్లూరి చిరంజీవి, ముప్పాల లక్ష్మణరావు (గణపతి) సీపీఐ-ఎంఎల్ పార్టీ ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రారంభిచారు, తెలంగాణలో విద్యార్థులు అధిక సంఖ్యలో నక్సలైట్లుగా మారడానికి వరవరరావు, గద్దర్‌తోపాటు విప్లవ రచయితల సంఘం ప్రచురణలు, గేయాలు, విప్లవ సాహిత్యం, సాంస్కృతిక ప్రదర్శనలు యువతను ప్రేరేపించాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జార్జిరెడ్డి హత్యానంతరం 1973-74లో విద్యార్థులు పీడీఎస్‌యూ పేరుతో సంఘటితమై ఉద్యమాలు రూపొందించారు. కొండపల్లి సీతారామయ్య, మల్లోజుల కోటేశ్వరరావు, నల్లా ఆదిరెడ్డి, శనిగరం వెంకటేశ్వర్లు (సాహూ), సూరపరెడ్డి జనార్దన్, నారదాసు లక్ష్మణరావు, అల్లం నారాయణ, అల్లం వీరయ్య, బీ విజయకుమార్ తదితరులు 1974 అక్టోబర్ 13న రాడికల్ విద్యార్థి విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఈ పేరును ప్రజాకవి శ్రీశ్రీ ఖరారు చేశారు. దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో రాడికల్ విద్యార్థి సంఘాల ద్వారానే విప్లవ ఉద్యమాల పోరు జరిగింది. 1975 జూన్ 25 నుంచి 1977 మార్చి 21 వరకు ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో ఎమర్జెన్సీ విధించింది. ఆ కాలంలో వందలాది మంది యువకులను పోలీసులు కాల్చి చంపారు, వేలాదిమంది యువకులు జైళ్ల పాలయ్యారు. వరంగల్ ఆర్ఈసీ కాలేజీలో ఇంజినీరింగ్ చదువుతున్న ఆర్ఎస్‌యూ నాయకుడు సూరపనేని జనార్దన్, ఎల్బీ కాలేజీ విద్యార్థి లంక మురళీమోహన్‌రెడ్డిని 1975 జూలైలో సిద్దిపేట సమీపంలోని గిరాయిపల్లి గుట్టల్లో చెట్లకు కట్టేసి కాల్చి చంపారు. దేశంలోని ఆయా రాష్ట్రాలలో పేరు మోసిన ఉద్యమకారులను ఎంతోమందిని కాల్చి చంపారు. 1977 మార్చిలో ఎమర్జెన్సీ ఎత్తివేశాక అనేక ఘటనలు వెలుగు చూశాయి. 1978-79 ప్రాంతంలో మళ్లీ విప్లవకారులు పెద్ద ఎత్తున ఒక్కటయ్యారు. సభలు, సమావేశాలు, సాంస్కృతిక ప్రదర్శన నిర్వహిస్తూ ఉద్యమాలకు మళ్లీ ఊపిరి పోశారు. స్వాతంత్ర్యం వచ్చి అప్పటికి 33 ఏండ్లయినా వ్యవస్థలో ఏమాత్రం మార్పు రాలేదు. ఏ పేదవాడి కోసమైతే ఉద్యమాలు పుట్టాయో ఆ ఉద్యమాల ఆశలు, ఆశయాలు రవ్వంత కూడా నెరవేరలేదన్న ఉక్రోషంతో యువత మళ్లీ కదం తొక్కింది. జమీందారులు, జాగిర్దారులు, దేశ్‌ముఖ్‌లు, దొరలు, భూస్వాముల పీడ విరుగుడు కాలేదు. ప్రభుత్వం, పాలకులు, అధికార యంత్రాంగం వారికి పెంపుడు అనుకూలంగా మారటంతో ఉద్యమాలు పెల్లుబుకాయి. నక్సలైట్లు 1978లో 'గ్రామాలకు తరలండి' పేరుతో ప్రజల దీనస్థితిని తెలుసుకున్నారు. 1978 డిసెంబర్ 8న నిర్వహించిన జగిత్యాల జైత్రయాత్ర తర్వాత ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఉద్యమ పోరాటం మరింత పటిష్టమైంది. ఈ సభ తర్వాత కొండపల్లి సీతారామయ్య తన సెంట్రల్ ఆర్గనైజింగ్ కమిటీ(సీవోసీ)ని 1980 ఏప్రిల్ 22న పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ)గా మార్చారు. 1981 ఏప్రిల్ 20న పీపుల్స్‌వార్ ఇంద్రవెల్లి గిరిజన మహాసభలు తెలంగాణలో ప్రకంపన సృష్టించాయి. పోలీస్ కాల్పుల్లో దాదాపు 18 మంది మరణించగా వందలాదిమంది క్షతగాత్రులయ్యారు. 1983లో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించి తమ ఎన్నికల ప్రచారంలో నక్సలైట్లే దేశభక్తులని ప్రకటించారు. తొమ్మిది నెలల్లోనే అధికారం చేపట్టారు. నక్సలైట్లు రాష్ట్రవ్యాప్తంగా తమ ఉద్యమాన్ని విస్తరిస్తూ మద్యపాన నిషేధం అమలు డిమాండ్ తీవ్రతరం చేశారు. ఈ నేపథ్యంలోనే ఎన్టీఆర్ మద్యపానం నిషేధాన్ని అమలు చేశారు. నక్సలైట్లు తమ డిమాండ్ల సాధన కోసం రాజకీయ నాయకులు, అధికారులు సిబ్బందిని కిడ్నాప్ చేశారు. పోలీసులు, నక్సలైట్లకు మధ్య పోరు తీవ్రమైంది. నక్సలిజాన్ని అణచివేసే క్రమంలో పోలీసులు నక్సల్స్ సానుభూతిపరులపై కేసులు పెడుతూ దాడులు చేస్తూ ఎన్‌కౌంటర్లకు పాల్పడ్డారు. 1989లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నక్సలైట్లపై నిషేధం ఎత్తివేస్తున్నట్టు ప్రకటించారు. ఆ పరిస్థితిని నక్సలైట్లు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. యువత పెద్దసంఖ్యలో నక్సలైట్లలో కలిసిపోయారు. ఎంతోమంది మహిళలు సైతం ఉద్యమంలో చేరారు. ఉత్తర తెలంగాణలో నక్సలైట్ల ఒత్తిడితో కొందరు భూస్వాములు, దొరలు తమ భూములను పేదలకు పంచారు. చాలామంది దొరలు, భూస్వాములు, బడా రాజకీయ నాయకులు గ్రామాలను వదిలి పట్టణాల్లో తలదాచుకున్నారు. చాలామంది నక్సలిజంలో చేరి తమ స్వార్థ ప్రయోజనాలు వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు పనులు చక్కబెట్టుకునేందుకు బెదిరింపులకు దోపిడీ దొంగతనాలు కూడా పాల్పడ్డారు. వారిని కట్టడి చేసేందుకు నక్సలైట్లు కొందరిపై హింసాత్మక చర్యలకు దిగారు. సీపీఐ (ఎంఎల్), పీడబ్ల్యూజీ, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ) తదితర ఉద్యమ పార్టీలన్నీ ఏకమై 2004 సెప్టెంబర్ 21న సీపీఐ మావోయిస్టు

# చిరుతో మరోమారు బాబీ సినిమా





మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి.

మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.

## ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం



సంతాపం ప్రకటించిన పవన్

విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు.

# సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.

శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని





చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ఫ్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శు భాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్.

## సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్

## రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..

దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ



## ఓటిటిలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేదని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.



## ఆంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.10.73 లక్షలు...



గద్వాల//మార్చి 30 (ఆకాంక్ష) : జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలంలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి కవిత పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా మొత్తం రూ.10,73,245 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో రూ.9,65,470 నగదు రూపంలో, రూ.1,07,775 చిల్లర నాణేల రూపంలో సమకూరినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో బంగారు, వెండి వస్తువులు ఏవీ రాలేదని పేర్కొన్నారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో భీంపురం గ్రామ సర్పంచ్ రఘు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, యువకులు, ధరూర్ పోలీసులు పాల్గొని భక్తిశ్రద్ధలతో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ గిరిరావు, అర్చకులు భీమ్ సేనాచారి సహా పలువురు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల కోసం రూ.2 లక్షల నిధి కేటాయింపు...



నాగర్ కర్నూల్//మార్చి 30 (ఆకాంక్ష) : పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం క్లాస్మేట్ క్లబ్ సభ్యులు మరోసారి తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపకులు శ్రీ వాస రాఘవేందర్ లక్ష్మీ దంపతుల కుమారులు వంశీకృష్ణ వందన కమల్ పుట్టినరోజు సందర్భంగా రూ.2 లక్షల నిధిని పేద విద్యార్థుల కోసం కేటాయించారు. ఈ నిధిపై వచ్చే వడ్డీ మొత్తాన్ని ప్రతి నెల ఒక ప్రాంతంలో సేవా కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థుల సంక్షేమం వారి చదువుకు అవసరమైన సహాయాన్ని అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సేవాభావాన్ని ప్రశంసిస్తూ కొల్లాపూర్ ఉపాధ్యక్షులు సోమిశెట్టి ప్రేమ్ కుమార్, శ్రీలత, జిల్లా మహిళ ఉపాధ్యక్షులు చిత్తనూరు శ్రీదేవి, జిల్లా కార్యదర్శి గుడిపాటి ప్రదీప్ కుమార్, రాధిక, క్లాస్మేట్ క్లబ్ కొల్లాపూర్ మహిళా అధ్యక్షురాలు ఆకుతోట కుసుమతో పాటు ఇతర ప్రతినిధులు అభినందనలు తెలిపారు. సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందించే ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తరించాలని వారు ఆకాంక్షించారు. క్లాస్మేట్ క్లబ్ కొల్లాపూర్ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలపై అత్యవసర హెచ్చరిక

### ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచన....

నాగర్ కర్నూల్//మార్చి 30 (ఆకాంక్ష) : దేశవ్యాప్తంగా తీవ్రమైన ఎండల నేపథ్యంలో వాతావరణ శాఖ అత్యవసర హెచ్చరిక జారీ చేసినట్లు సమాచారం. ఏప్రిల్ 29 నుంచి మే 12 వరకు దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకునే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉష్ణోగ్రతలు 45ళీజ నుంచి 55ళీజ వరకు నమోదయ్యే అవకాశముందని తెలిపారు. ఈ సమయంలో ప్రజలు అత్యవసర అవసరాలు లేకపోతే బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఇంటి లోపలే ఉండాలని హెచ్చరించారు. ఎండ తీవ్రత కారణంగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, తలనొప్పి, అలసట, వాంతులు వంటి లక్షణాలు కనబడితే వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావంతో వేడి గాలులు (హీట్ వేవ్స్) ఎక్కువగా వీచే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని అధికారులు చెప్పారు. గదుల్లో గాలి సరిగా వచ్చేలా తలుపులు, కిటికీలు తెరిచి ఉంచాలని, అవసరమైనప్పుడు మాత్రమే ఎయిర్ కండిషనర్లను వినియోగించాలని సూచించారు. ఇంటి లోపల ఉష్ణోగ్రతను 2425ళీజ వద్ద నియంత్రించుకోవాలని సూచించారు. అలాగే శరీరాన్ని చల్లగా ఉంచేందుకు పెరుగు, మజ్జిగ, బేల్ పండు రసం వంటి ద్రవ పానీయాలను ఎక్కువగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. రోజంతా తగినంత నీరు తాగడం ద్వారా డీహైడ్రేషన్‌ను నివారించవచ్చని తెలిపారు. వాహన దారులకు కూడా ప్రత్యేక సూచనలు జారీ చేశారు. ఎండలో పార్క్ చేసిన కార్లలో గ్యాస్ పదార్థాలు, లైటర్లు, కార్బోనేటెడ్ పానీయాలు, సుగంధ ద్రవ్యాలు, బ్యాటరీలు ఉంచకూడదని హెచ్చరించారు. వాహనాల్లో గాలి ప్రసరణ కోసం కిటికీలు కొద్దిగా తెరిచి ఉంచాలని సూచించారు. ఇంధన ట్యాంక్‌ను పూర్తిగా నింపకుండా సాయంత్రం సమయంలోనే నింపుకోవాలని చెప్పారు. ప్రయాణ సమయంలో టైర్లలో అధిక గాలి నింపకూడదని సూచించారు. ఇక ఎండల కారణంగా పాములు, తేళ్లు చల్లని ప్రదేశాల కోసం ఇళ్లలోకి వచ్చే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్యాస్ సిలిండర్లు నేరుగా ఎండలో ఉంచకూడదని, విద్యుత్ మీటర్లపై అధిక లోడ్ వేయకూడదని సూచించారు. ప్రతి 23 గంటలకు విశ్రాంతి తీసుకోవడం ద్వారా శరీరాన్ని రక్షించుకోవచ్చని వైద్యులు పేర్కొన్నారు. అవసరం లేని సమయంలో బయటకు వెళ్లకుండా ఉండటం, నేరుగా సూర్యకాంతిని తప్పించుకోవడం ద్వారా హీట్ స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని, ఈ సమాచారాన్ని ఇతరులతో పంచుకోవాలని వాతావరణ శాఖ విజ్ఞప్తి చేసింది.

## జిల్లేడు చౌదరిగూడా మండలం ఇసుక మాఫియా జోరు...

### గ్రామాల్లో ఆందోళన...



షాద్ నగర్//మార్చి 30 (ఆకాంక్ష) : జిల్లేడు చౌదరిగూడా మండల పరిధిలోని చింతకుంట తండా, ముష్టిపల్లి తండా, జాకారం తండాల పరిసర ప్రాంతాల్లో అక్రమ ఇసుక దందా రోజురోజుకు విస్తరిస్తూ స్థానిక ప్రజలను తీవ్రంగా కలవరపెడుతోంది. అనుమతులు లేకుండా రాత్రి వేళల్లో ట్రాక్టర్ల ద్వారా భారీ స్థాయిలో ఇసుక తరలింపు జరుగుతుండటంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా సాగుతున్న ఈ అక్రమ రవాణా కారణంగా భూగర్భ జలాల మట్టం గణనీయంగా పడిపోతుందని, వాగుల సహజ ప్రవాహం దెబ్బతింటోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విచ్చలవిడి ఇసుక తోడకం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, గ్రామాల మధ్య రోడ్లు భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా ధ్వంసమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యపై సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్న గ్రామస్థులు, యువకులు, రైతులు కలిసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అక్రమ ఇసుక రవాణాను తక్షణమే అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. ఈ ఘటనతో మండలంలో ఇసుక మాఫియా వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది.

## మంథని రూరల్‌లో రైతుల ఆవేదన...

### ఆన్లైన్ రికార్డుల నుంచి 2 ఎకరాల 33 గుంటల భూమి తొలగింపు...




మంథని రూరల్//మార్చి 30 (ఆకాంక్ష) : మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 292లో తమకు చెందిన 2 ఎకరాల 33 గుంటల భూమిని ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఆన్లైన్ రికార్డుల నుంచి తొలగించారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మంథని డివిజన్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు తమ సమస్యను వెల్లడించారు. ఈ సందర్భంగా శీలం జనార్దన్ రెడ్డి, శీలం మధుకర్ రెడ్డి, లెక్కల శ్రీలత, లెక్కల లక్ష్మారెడ్డి, బాద్రపు మధుకర్ మాట్లాడుతూ, సర్వే నెంబర్ 292లో 1980 సంవత్సరంలో మొత్తం 13 ఎకరాల 10 గుంటల భూమిని కొనుగోలు చేసి అప్పటి నుంచి సాగు చేస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల ఎంజాయ్‌మెంట్ సర్వే పేరుతో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా 2 ఎకరాల 33 గుంటల భూమిని ఆన్లైన్ రికార్డుల నుంచి తొలగించారని ఆరోపించారు. తమకు చెందిన భూమిలో శీలం జనార్దన్ రెడ్డికి 14.50 గుంటలు, శీలం మధుకర్ రెడ్డికి 14.50 గుంటలు, లెక్కల శ్రీలతకు 18 గుంటలు, లెక్కల లక్ష్మారెడ్డికి 36 గుంటలు, బాద్రపు మధుకర్‌కు 30 గుంటలు ఉన్నాయని, మొత్తం కలిపి 2 ఎకరాల 33 గుంటల భూమి ఫిబ్రవరి నెలలో ఆన్లైన్ నుంచి తొలగించబడినట్లు గుర్తించామని తెలిపారు. ఈ విషయమై ఆర్ఐ మరియు డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించగా, సీసీఎల్ మరియు కలెక్టర్ నుంచి ఒత్తిడి ఉన్నందువల్ల ఇలా చేయాల్సి వచ్చిందని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆరోపించారు. దాదాపు 46 సంవత్సరాలుగా తమ ఆధీనంలో ఉన్న భూమిని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా 3-4-2025న శీలం విక్రమ్ రెడ్డి తన పాసుబుక్‌లో భూమి తక్కువగా ఉందని ఎంజాయ్‌మెంట్ సర్వే చేయించుకోవడంతో, తమకు సమాచారం ఇవ్వకుండా ఈ మార్పులు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, తొలగించిన భూమిని తిరిగి ఆన్లైన్ రికార్డుల్లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్‌ను రైతులు కోరారు.

# షాద్‌నగర్‌లో తాటి చెట్ల నరమేధం...

### 'సువర్ణ సంపద' పేరుతో సహజ సంపద నాశనం...









షాద్‌నగర్//మార్చి 30 (ఆకాంక్ష) :రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సహజ సంపదను నిర్మూలించడమే లక్ష్యంగా వ్యవహరించిన ఘటన షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని నాగులపల్లి రోడ్‌లో వెలుగుచూసింది. 'వారాహి సువర్ణ సంపద' పేరుతో భారీగా ప్లాట్ల వెంచర్ ఏర్పాటు చేస్తున్న యాజమాన్యం, తమ వ్యాపారానికి అడ్డుగా ఉన్నాయని భావించి దశాబ్దాలుగా పెరిగిన తాటి చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికి వేసి ధ్వంసం చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికుల సమాచారం ప్రకారం, వెంచర్ పరిధిలో ఉన్న సుమారు 30 నుంచి 40 వరకు భారీ తాటి చెట్లను వేర్లతో సహా పీకివేసి పూర్తిగా నాశనం చేశారు. అనంతరం ఎవరికి తెలియకుండా వాటిని అగ్నికి ఆహుతి చేయడానికి ప్రయత్నించినట్లు తెలుస్తోంది. విషయం తెలిసిన గౌడ సామాజికవర్గానికి చెందిన ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా, చెట్లు పూర్తిగా కాలిపోయి మాడి మసైపోయిన దృశ్యాలు కనిపించాయి. తాటి చెట్లు గౌడ సమాజానికి ముఖ్యమైన జీవనోపాధి వనరుగా ఉండటంతో ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. "రియల్ వ్యాపారం కోసం మా జీవనాధారాన్ని నాశనం చేయడం అన్యాయం" అని గౌడ సంఘం నేతలు మండిపడుతున్నారు. చెట్లను ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే స్థానిక ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. దీనిపై స్పందించిన ఎక్సైజ్ సీఐ, ఫిర్యాదు అందిందని, సంఘటన స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు సేకరించామని పేర్కొన్నారు. విచారణ అనంతరం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం తాటి, ఈత చెట్లను తొలగించాలంటే ముందుగా ఎక్సైజ్ శాఖకు సమాచారం అందించి, వారి అనుమతితో మాత్రమే ఇతర ప్రదేశాలకు తరలించాలి. అనుమతి లేకుండా చెట్లను ధ్వంసం చేస్తే ఒక్కో చెట్టుకు రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు జరిమానా విధించడంతో పాటు, తీవ్రతను బట్టి జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉంది. అయితే ఈ నిబంధనలను పూర్తిగా విస్మరించి 'సువర్ణ సంపద' యాజమాన్యం చెట్లను భారీగా నరికి వేసినట్లు ఆరోపణలు రావడంతో, అధికార యంత్రాంగం ఎలా స్పందిస్తుందనే అంశంపై స్థానికుల్లో ఉత్కంఠ నెలకొంది. సహజ సంపదను కాపాడాల్సిన సమయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డు వెంటనే నిర్వహించాలి....

### లేకుంటే ప్రజాభవన్ ముట్టడి..

### టిబిజీకేస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి...



గోదావరిఖని//మార్చి 30 (ఆకాంక్ష) : సింగరేణిలో పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డును తక్షణమే నిర్వహించాలని, లేకపోతే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టిబిజీకేస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి హెచ్చరించారు. సోమవారం సాయంత్రం ఆర్జీ-1 ఏరియా కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వాలు గోల్డెన్ హ్యాండ్ షేక్ పేరిట 20 వేల మందిని, డిస్మిస్ పేరుతో మరో 10 వేల మందిని ఉద్యోగాల నుండి తొలగించాయని, ప్రస్తుతం కూడా అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోందని విమర్శించారు. సింగరేణిలో అవినీతి పెరిగి పోతుందని, కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాల్లో చేరిన కార్మికులను ఏసీబీ, విజిలెన్స్ దాడుల పేరుతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. అవినీతి విచారణ ఉద్యోగులపై కాకుండా బొగ్గు గనులపై ఆసక్తి చూపుతున్న మంత్రులపై జరపాలని డిమాండ్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికులను మెడికల్ బోర్డుకు పిలవకుండా, బోర్డును నిలిపివేయాలని ప్రభుత్వం, అధికారులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెలకు మూడు మెడికల్ బోర్డులు నిర్వహిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కార్మికులను మోసం చేసిందని ఆరోపించారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 2000 మంది కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ, గత సంవత్సరం నుండి మెడికల్ బోర్డు కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. రెగ్యులర్‌గా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడంతో కార్మికులు దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థలో జరుగుతున్న అవినీతి, నిధుల దుర్వినియోగంపై కార్మికులు అప్రమత్తం కావాలని, సంస్థ పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే సింగరేణి భవన్, ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమానికి కార్మికులందరూ సిద్ధంగా ఉండాలని సూచించారు. ఆర్జీ-1 ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో టిబిజీకేస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య, కోశాధికారి చెల్పూరి సతీష్‌తో పాటు పలువురు నాయకులు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### భారీగా కుదేలవ్వనున్న బంగారంధరలు..

# గోల్డ్ ప్రియులకు ఇదొక డేంజర్ బెల్



ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్.. బంగారం కొనుగోళ్లతో మార్కెట్‌లు సందడిగా ఉండాల్సిన సమయం. కానీ గోల్డ్ షాపుల్లో ఆ సందడి లేదు. బంగారం కొనాలన్న ఆలోచనే పక్కన పెట్టేశారు జనం. కానీ గోల్డ్ రేట్ మాత్రం పగ్గాలు లేకుండా దూసుకుపోతోంది. మార్కెట్ సూత్రం ప్రకారం..డిమాండ్ తగ్గితే ధర తగ్గాలి. మరి గోల్డ్ విషయంలో అలా ఎందుకు జరగడం లేదు.. పట్టపగ్గాలు లేకుండా పెరిగిపోతోంది బంగారం రేటు. ఏ రోజుకారోజు..సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది. బంగారం ధర పెరుగుతోందంటే.. అదికొన్నవాళ్లలో ఆనందం ఉండాలి. కానీ ప్రస్తుతం బంగారం కొంటున్న వాళ్లలో ఒకరకమైన భయం మొదలయింది. ఎందుకంటే.. బంగారం ధర నిజంగా పెరుగుతోందా..?లేక ఎవరైనా కావాలని పెంచుతున్నారా.. అనే సందేహం వారిని వెంటాడుతోంది. గతంలో జరిగిన పరిణామాలు కూడా అందుకు కారణం. 2025లోనే బంగారం ధర 60 శాతం పెరిగింది. ఇది మామూలు పెరుగుదల కాదు.. అసాధారణమైన పెరుగుదల. ఇది ఒకరకంగా 'బబుల్' అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఈ బబుల్ ఎప్పుడైనా పగిలిపోవచ్చని.. సామాన్యులు ఆ ట్రాప్‌లో పడవద్దని హెచ్చరిస్తున్నారు. బంగారం ధర ఈ స్థాయిలో పెరుగుదలకు విదేశీ సంస్థల 'రిపోర్ట్' మాయాజాలం కూడా కారణం కావచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్కెట్ గరిష్ట స్థాయిలో ఉన్నప్పుడు.. గోల్డ్‌మ్యాన్ సాక్స్, జేపీ మోర్గాన్ వంటి పెద్ద పెద్ద విదేశీ రీసెర్చ్ సంస్థలు "బంగారం ఇంకా పెరుగుతుంది" అంటూ పాజిటివ్ రిపోర్ట్స్ ఇస్తాయి. సామాన్యులు ఆ రిపోర్ట్స్ నమ్మి ఎగబడి కొంటారు. అదే సమయంలో.. ఆ సంస్థలు, పెద్ద ఇన్వెస్టర్లు తమ దగ్గర ఉన్న బంగారాన్ని మెల్లగా అమ్ముకుని లాభాలు తీసుకుంటారు. చివరికి రేట్లు పడిపోయాక..వాళ్లు లాభాల్లో ఉంటారు. గరిష్ట రేటుకు కొన్న సామాన్యులు మాత్రం నష్టాల్లో చిక్కుకుంటారు. ఏదైనా వస్తువు ధర సప్లై-డిమాండ్ మీద ఆధారపడి ఉంటుంది. కానీ బంగారం ధర మాత్రం లండన్, న్యూయార్క్‌లో ఉండే కొన్ని పెద్ద బ్యాంకులు కూడబలుక్కొని ధరను ఫిక్స్ చేస్తాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎందుకంటే గతంలో జే.పీ మోర్గాన్ బ్యాంక్ "స్పూఫింగ్" అనే టెక్నిక్ వాడి గోల్డ్ రేట్‌ను అమాంతం పెంచేసింది. కొనాలని లేకపోయినా లక్షల కొద్దీ "ఫేక్ ఆర్డర్స్" పెట్టి, రేటు పెరిగాక ఆ ఆర్డర్స్ క్యాన్సిల్ చేయడమే "స్పూఫింగ్" టెక్నిక్. ఈ నేరం బయటపడ్డంతో ఆ బ్యాంకు ఏకంగా 920 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో సుమారు 7 వేల 600 కోట్ల రూపాయల జరిమానా కట్టింది. దీన్ని బట్టి మార్కెట్ మ్యానిపులేషన్ నిజమేనని తెలుస్తోంది. ఈ బంగారం ధర 'బుడగలా' పేలిపోయే అవకాశం ఉందన్న వాదనకు గతంలో జరిగిన ఘటనలు కూడా ఆధారంగా నిలుస్తున్నాయి. 1980లో బంగారం రేటు పీక్స్‌కి వెళ్లింది. దీంతో అందరూ ఎగబడి కొన్నారు. తర్వాత 57% పడిపోయింది. మళ్ళీ ఆ రేటు రావడానికి 25 ఏళ్లు పట్టింది. లేటెస్ట్‌గా 2011లో కూడా మళ్ళీ అలాగే పెరిగింది. తర్వాత 45% క్రాష్ అయ్యింది. అది కోలుకోవడానికి 4 ఏళ్లు పట్టింది. ఇప్పుడు 2026లో కూడా సేమ్ సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు అనలిస్ట్‌లు. స్టాక్ మార్కెట్ కుప్పకూలితే ఇన్వెస్టర్లు నగదు కోసం బంగారం, వెండి ఈటీఎఫ్‌లను విక్రయించడం ప్రారంభిస్తారు. తక్కువ ధరలో దొరుకుతున్న షేర్లను కొనడానికి వీటిలో లాభాలను స్వీకరించడం సహజం. దీనివల్ల బంగారం, వెండి ధరల్లో పెద్ద ఎత్తున దిద్దుబాటు వచ్చే అవకాశం ఉంటుంది. సామాన్యుల్లో కొనాలనే ఆసక్తి ఉంటేనే ఏ వస్తువుకైనా డిమాండ్ ఉంటుంది. ఒక్కసారి వారికి ఆ సెంటిమెంట్ పోతే.. దాని ధర ఎంత పెరిగినా, తగ్గినా పట్టించుకునే వాళ్లు ఉండరు. ఇప్పటికే పేదలకు దూరమైన బంగారం..మధ్య తరగతి ప్రజలకు కూడా త్వరలోనే అందని సరుకుగా మారిపోనుంది. ప్రస్తుతం మన దగ్గర పెళ్లిళ్ల సీజన్ ఉన్నా కూడా..జనం బంగారం కొనడం తగ్గించేశారు. రిటైల్ మార్కెట్లో కొనుగోళ్లు భారీగా పడిపోయాయి. ఇది ఒక డేంజర్ సిగ్నల్. ఎప్పుడైతే సామాన్యులు కొనలేరో.. అప్పుడు రేట్లు పడటం ఖాయం. మార్కెట్ విశ్లేషకులు కూడా అదే చెబుతున్నారు.

తొలి ఆకాంక్ష



## పశువుల కోసం నీటి సౌకర్యం ఏర్పాటు చేయండి...

### బీఆర్ఎస్ పార్టీ నాయకులు నీరటి శ్రీనివాస్ విజ్ఞప్తి



గోదావరిఖని//**మార్చి 30 (ఆకాంక్ష) :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని తిలక్ నగర్, జవహర్ నగర్ (దుర్గ మాత గుడి), 5-ఇన్ లైన్, మెయిన్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో పశువులు, ముఖ్యంగా గోమాతలు మరియు ఆవులు అధికంగా సంచరిస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీరటి శ్రీనివాస్ తెలిపారు. రాబోయే ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పలు కేంద్రాల్లో పశువులకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కుండీలు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఎండకాలంలో నీటి కొరత కారణంగా పశువుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని, వాటిని కాపాడడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. మానవత్వ దృక్పథంతో అధికారులు ముందుకు వచ్చి తక్షణ చర్యలు తీసుకోవాలని, సమాజంలోని ప్రతి ఒక్కరూ కూడా ఈ విషయంలో సహకరించాలని నీరటి శ్రీనివాస్ కోరారు.

## విద్య కుసుమం కంది విద్యా సేవలకు గుర్తింపు...

### కంది రవీందర్ రెడ్డికి జాతీయ ఉగాది పురస్కారం...




గోదావరిఖని//**మార్చి 30 (ఆకాంక్ష) :** విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తూ అనేక మంది విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న గీతాంజలి హై స్కూల్ వ్యవస్థాపకుడు కంది రవీందర్ రెడ్డికి జాతీయ స్థాయిలో గౌరవం దక్కింది. తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రదానం చేసే ప్రతిష్టాత్మక జాతీయ ఉగాది పురస్కారాన్ని ఆయన అందుకున్నారు.1990 విద్యా సంవత్సరంలో గీతాంజలి హై స్కూల్‌ను స్థాపించిన కంది రవీందర్ రెడ్డి విద్యా రంగంలో నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ముందుకు సాగుతున్నారు.ఆయన పాఠశాలలో విద్యార్థులు కేవలం పాఠ్యాంశాల్లోనే కాకుండా నైతిక విలువలు,క్రమశిక్షణ, సమాజ సేవా భావాలను అలవర్చుకునేలా శ్రమిస్తున్నారు.విద్యా రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా ఆయనకు భారతరత్న డాక్టర్ అబ్దుల్ కలాం బెస్ట్ టీచర్ అవార్డు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా లభించడం విశేషం. అదే విధంగా పెద్దపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష చేతుల మీదుగా సత్కారం పొందారు. కేవలం విద్యా బోధనతో మాత్రమే కాకుండా పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటూ సమాజానికి సేవలందిస్తున్నారు.పేద విద్యార్థులకు సహాయం అందిస్తూ పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల ద్వారా ప్రజల మన్ననలు పొందుతున్నారు.ఈ క్రమంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన తారా ఆర్ట్స్ అకాడమీ, జాతీయ ఉగాది పురస్కారంతో సత్కరించింది. ఈ పురస్కారాన్ని మేయర్ మహంకాళి స్వామి మరియు నిర్వాహకులు సంకే రాజేష్ చేతుల మీదుగా ఘనంగా ప్రదానం చేశారు.ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, ప్రజా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు కంది రవీందర్ రెడ్డిని అభినందిస్తూ, ఆయన సేవలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా విద్యా రంగంలో మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## ప్రముఖ బహుభాషా నటుడు ప్రకాశ్ రాజ్ ఇంట విషాదం...

### ప్రకాశ్ రాజ్ మాతృమూర్తి సువర్ణలత అనారోగ్యంతో మృతి...

హైదరాబాద్//**మార్చి 30 (ఆకాంక్ష) :** ప్రముఖ బహుభాషా నటుడు ప్రకాశ్ రాజ్ ఇంట విషాదం చోటు చేసుకుంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం కన్నుమూశారు. బెంగళూరులోని స్వగృహంలోనే ఆమె తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వృద్ధాప్య సంబంధిత అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతున్న సువర్ణలత ఆరోగ్యం ఇటీవల మరింత క్షీణించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఈ రోజు ఉదయం ఆమె మరణించినట్లు కుటుంబ వర్గాలు వెల్లడించాయి.సాయంత్రం బెంగళూరులోనే సువర్ణలత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె మృతి పట్ల సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నారు.తన తల్లి మరణంతో ప్రకాశ్ రాజ్ తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు, సన్నిహితులు ఆమెకు నివాళులు అర్పిస్తున్నారు.

## స్కాలర్‌షిప్ గడువు ఏప్రిల్ 20 వరకు పొడిగింపు...



రాజన్నసిరిసిల్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** 2025-26 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల నమోదు గడువును వచ్చే నెల ఏప్రిల్ 20వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి డాక్టర్ వి. రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ మరియు దివ్యాంగ విద్యార్థులు తమ ఫ్రెష్ మరియు రెన్యువల్ ద దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. అర్హులైన విద్యార్థులు తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలోని అన్ని కళాశాలల ప్రిన్సిపాల్స్ మరియు యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించి,తమ విద్యార్థులందరూ సకాలంలో దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు సంబంధిత కార్యాలయంలో సంప్రదించవచ్చు.

## జర్నలిస్ట్ కేపీ, మాజీ జెడ్పీటీసీ వెంకట్రాంరెడ్డిల అరెస్టు..

### అసెంబ్లీ ముట్టడి కోసం షాద్ నగర్ పోలీసుల ముందస్తు చర్యలు...

### ఉద్యమకారుల ఆకాంక్షను నెరవేరేందుకు జైలుకెళ్ళడానికైనా సిద్ధమే..



షాద్ నగర్//**మార్చి 30 (ఆకాంక్ష) :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోలేదని ఆరోపిస్తూ ఈనెల 30న అసెంబ్లీని ముట్టడిస్తామని తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల పిలుపుకు ప్రభుత్వం స్పందించి ముందస్తు చర్యలను చేపట్టింది. సోమవారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ పోలీసులు తెలంగాణ ఉద్యమకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు,మాజీ జెడ్పిటిసి పి వెంకటరామ్ రెడ్డి,సీనియర్ జర్నలిస్టు వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు ఎండి ఖాజాపాషా (కేపి)లను ముందస్తు అరెస్టులు చేశారు. వారి ఇళ్ల వద్ద నుండి అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఇంటెలిజెన్స్ వర్గాల నివేదిక ప్రకారం స్థానిక పోలీసులు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని విఫలం చేసేందుకు పలువుని అరెస్టు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు,కాంగ్రెస్ నాయకుడు పి. వెంకట్రాంరెడ్డి, జర్నలిస్ట్ కేపీలు పోలీస్ స్టేషన్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయనీ, అధికారంలోకి రావడానికి ముందు తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు, హెల్త్ కార్డులు, 250 చదరపు గజాల ఇంటి స్థలం, రూ.25 వేల గౌరవ పెన్షన్ అందజేస్తామని, అధికారంలోకి వచ్చాక వారిని విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు. ఉద్యమకారులకు సంక్షేమ ఫలాలు దక్కడానికి తాము జైలుకు వెళ్లడానికైనా సిద్ధమేనని స్పష్టం చేశారు. స్వరాష్ట్రంలో ప్రభుత్వం ఉద్యమకారులకు భయపడి అరెస్టులకు పాల్పడడం హాస్యాస్పదమని అన్నారు.ఉద్యమ కారులు పినపాక ప్రభాకర్, మన్నె నారాయణ, రాజ్యలక్ష్మి, సిరాజుద్దీన్ తదితరులను అదుపులోకి తీసుకోవడానికి పోలీసులు ప్రయత్నాలు మొదలుపెట్టారు..

## విద్యుత్ షాక్‌తో సిపిఎం రైతు కార్యదర్శి మృతి...

రాజన్నసిరిసిల్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో విషాదం చోటు చేసుకుంది. సిపిఎం పార్టీకి చెందిన రైతు కార్యదర్శి జంగం అంజయ్య విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని వెంకట్రాయుని చెరువు సమీపంలోని పంట పొలంలో సోమవారం జరిగింది.స్థానికుల సమాచారం ప్రకారం, జంగం అంజయ్య తన వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లిన సమయంలో అనుకోకుండా విద్యుత్ ప్రవాహం ఉన్న తీగకు తగిలి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన రైతులు వెంటనే సహాయక చర్యలు చేపట్టినప్పటికీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు తెలుస్తోంది.ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అంజయ్య మృతి పట్ల సిపిఎం నాయకులు, రైతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.

## సిరిసిల్ల మున్సిపల్ ప్రత్యేక బడ్జెట్ సమావేశం రేపు...



సిరిసిల్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో రేపు (మంగళవారం) పురపాలక సంఘం ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ ప్రత్యేక బడ్జెట్ సమావేశం మార్చి 31వ తేదీ ఉదయం 11:00 గంటలకు ప్రారంభం కానుంది.ఈ సమావేశం అనంతరం మధ్యాహ్నం 1:30 గంటలకు పురపాలక సంఘ కౌన్సిల్ సాధారణ సమావేశం జరగనుంది. ఈ రెండు సమావేశాల్లో మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతుల విస్తరణ, బడ్జెట్ కేటాయింపులు తదితర అంశాలపై సభ్యులు చర్చించనున్నారు. సమావేశాలు ముగిసిన తరువాత మున్సిపల్ చైర్‌పర్సన్ తన ఛాంబర్‌లో మీడియా ప్రతినిధులతో సమావేశమై, బడ్జెట్ ముఖ్యాంశాలు మరియు తీసుకున్న నిర్ణయాలపై వివరాలు వెల్లడించనున్నారు. మున్సిపల్ అభివృద్ధి దిశగా కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నందున ఈ సమావేశాలకు ప్రాధాన్యత నెలకొంది.

## ప్రజావాణికి పోటెత్తిన అర్జీలు...

### ఒక్కరోజులోనే 205 వినతులు...

### సమస్యల పరిష్కారానికి అధికారులకు కలెక్టర్ గరిమ అగ్రవాల్ కఠిన ఆదేశాలు...

సిరిసిల్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్వయంగా కార్యక్రమంలో పాల్గొని బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు.ఈ సందర్భంగా మొత్తం 205 దరఖాస్తులు అందగా, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా, క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని స్పష్టం చేశారు. ప్రజావాణిలో అందిన అర్జీలలో అత్యధికంగా రెవెన్యూ శాఖకు సంబంధించినవే ఉండటం గమనార్హం. రెవెన్యూ శాఖకు 82 దరఖాస్తులు అందగా, గృహ నిర్మాణ శాఖకు 35, డీఆర్డీఓ విభాగానికి 30 వినతులు వచ్చాయి.జిల్లా పంచాయతీ కార్యాలయానికి 9, ఉపాధి కల్పన విభాగానికి 8 చొప్పున అర్జీలు అందాయి. మున్సిపల్ కమిషనర్ కార్యాలయం, ఎస్పీ కార్యాలయం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విభాగాలకు తలా 5 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇతర శాఖలకు కూడా కొంతమంది ప్రజలు తమ సమస్యలను తెలియజేశారు.ప్రతి అర్జీదారుని సమస్యను బాధ్యతగా తీసుకుని, ఆలస్యం లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించడంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల మరియు వేములవాడ ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాబాయ్, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మెనూ కచ్చితంగా పాటించాలి...

### కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం...

### దుమాల ఈఎంఆర్ఎస్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ..



ఎల్లారెడ్డిపేట//**మార్చి 30 (ఆకాంక్ష) :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఈఎంఆర్ఎస్ ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, హాజరు నిర్వహణపై అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం స్టోర్ రూమ్‌ను సందర్శించి బియ్యం, నిత్యావసర సరుకులు, కోడిగుడ్లు, కూరగాయల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. నిల్వలు సక్రమంగా ఉన్నాయా, గడువు తేదీలు పాటిస్తున్నారా అనే విషయాలను వివరంగా తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని పరిశీలించిన ఆమె, ప్రభుత్వ మెనూ ప్రకారం చికెన్, మటన్, కోడిగుడ్లు సమయానికి, సరైన పరిమాణంలో అందిస్తున్నారా అని సిబ్బందిని ప్రశ్నించారు. ఆహార నాణ్యతలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. అనంతరం వసతి గదులు, తరగతి గదులను సందర్శించిన కలెక్టర్, పారిశుధ్య నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతో ముచ్చటించిన గరిమ అగ్రవాల్, చదువుపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సమయపాలనతో ప్రణాళికాబద్ధంగా చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ తనిఖీలో పాఠశాల సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్లకు రూ.18 వేల వేతనం వెంటనే అమలు చేయాలి...

### అసెంబ్లీలో తీర్మానం చేయాలని సిఐటియు డిమాండ్...



రాజన్నసిరిసిల్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆశ వర్కర్ల సమస్యలపై ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం ఆశ వర్కర్ల పట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నదని ఆరోపిస్తూ వారికి హామీ ఇచ్చినట్లుగా నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనాన్ని తక్షణమే అమలు చేసి అసెంబ్లీలో తీర్మానం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు.ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద భారీ రాస్తారోకో, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆశ వర్కర్లు పాల్గొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ మాట్లాడుతూ, ఆశ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. నిర్బంధ చర్యలతో ఆశ వర్కర్ల పోరాటాన్ని అణచి వేయలేమని ఆయన స్పష్టం చేశారు. నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి జయశీల, సిఐటియు నాయకులు సూరం పద్మ, బూర శ్రీనివాస్, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల తదితరులు పాల్గొన్నారు. అలాగే యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు భారతి, గాయత్రి, చంద్రకళ, జమున, లావణ్య,రజిత,రుక్మిణి, లత, భూలక్ష్మి, రేణుక, మమత, సునందతో పాటు పెద్ద ఎత్తున ఆశ వర్కర్లు హాజరై తమ డిమాండ్ల సాధన కోసం నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఆశ వర్కర్లు మాట్లాడుతూ, తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ నిరసన కార్యక్రమాన్ని ముగించారు.

### సహారా బాధితులకు బేషరతుగా

## డబ్బులు చెల్లించాలి సిపిఎం డిమాండ్...

### బోయిన్పల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా...




రాజన్నసిరిసిల్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయిన్ పల్లి మండల కేంద్రంలో సహారా బాధితుల సమస్యలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. సహారా ఇండియా గ్రూప్ కంపెనీలో డిపాజిట్ చేసిన బాధితులకు ఎలాంటి షరతులు లేకుండా వెంటనే డబ్బులు చెల్లించాలని సిపిఎం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మాట్లాడుతూ, అధిక వడ్డీ ఆశతో మరియు భవిష్యత్ అవసరాల కోసం ప్రజలు కష్టపడి సంపాదించిన సొమ్మును సహారాలో పెట్టుబడి పెట్టారని తెలిపారు.అయితే 2023లో సహారా అధినేత సుబ్రత రాయ్ మరణం అనంతరం సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడంతో డిపాజిటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఏడాదిలోపు డిపాజిటర్లకు నగదు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం అనేక నిబంధనలు, కఠిన షరతులు విధిస్తూ బాధితులను మరింత ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శించారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతూ బాధితులు విసిగి పోయారని పేర్కొన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సహారా బాధితులకు బేషరతుగా డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో బాధితులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రామంచ అశోక్, సిపిఎం నాయకులు కుడుకల గిరిబాబు, దూస జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే తమకు న్యాయం చేయాలంటూ సహారా బాధితులు వాసాల నరసయ్య, ద్యవ విజయ, పాముల సత్తవ్వ, భీమనాదుని ఆంజనేయులు, మ్యాన్ అంజనేయులు తదితరులు ధర్నాలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

## దేవాలయాల భద్రతలో నూతన అధ్యాయం

### తెర్లుమద్దిలో 'అలారం లాక్' ప్రారంభం...



ముస్తాబాద్//**మార్చి 30 (ఆకాంక్ష) :** జిల్లాలో దేవాలయాల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలో కీలక ముందడుగు పడింది. ఇటీవల ఆలయాల్లో పెరుగుతున్న దొంగతనాలు, ఆస్తి నేరాలను అరికట్టేందుకు గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో సరికొత్త 'అలారం లాక్' వ్యవస్థను ప్రారంభించారు. ఈ భద్రతా పరికరాన్ని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్, గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ అలారం లాక్ వ్యవస్థ ద్వారా ఆలయ సొత్తు, ప్రాచీన విగ్రహాలకు సమగ్ర రక్షణ కల్పించనున్నారు. తాళాన్ని ఎవరైనా బలవంతంగా తెరవడానికి లేదా పగులగొట్టడానికి ప్రయత్నించిన వెంటనే భారీ శబ్దంతో సైరన్ మోగే విధంగా ఈ పరికరం రూపొందించబడింది. దీంతో గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై, దొంగతనాలను అడ్డుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్ఐ గణేష్ మాట్లాడుతూ, ఆలయాల భద్రతలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం సమయోచిత నిర్ణయమని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు అప్రమత్తంగా ఉంటేనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు.తెర్లుమద్దిలో అమలు చేసిన ఈ విధానం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొంటూ, మండలంలోని అన్ని గ్రామాలు తమ తమ ఆలయాల్లో అలారం లాకులను ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఎస్ఐ గణేష్‌తో పాటు గ్రామ ప్రతినిధులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయాల రక్షణలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని అధికారులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే నిర్వహణ...

### గ్రీవెన్స్ డేలో 36 ఫిర్యాదులు స్వీకరణ...

### ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాలు...



రాజన్నసిరిసిల్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను స్వీకరించి వాటికి తక్షణ పరిష్కారం కల్పించడం లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తోంది. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ దేకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితులు, అర్జీదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా మొత్తం 36 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే స్వయంగా స్వీకరించారు.ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలిస్తూ సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించేందుకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే తమ ముఖ్య లక్ష్యమని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుని గౌరవంగా మర్యాద పూర్వకంగా స్వాగతించి, వారి వినతులను శ్రద్ధగా వినాలని పోలీస్ అధికారులకు సూచించారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి, చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడం ద్వారా పోలీస్ శాఖపై విశ్వాసం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, వాటి పరిష్కారంపై నిరంతర సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి కేసు పురోగతిని పర్యవేక్షిస్తూ బాధితులకు న్యాయం అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. గ్రీవెన్స్ డే కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా ఉన్నతాధికారులను కలుసుకుని తమ సమస్యలను వివరించే అవకాశం కలుగుతుందని, దీని ద్వారా సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని ఎస్పీ పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## రామగుండంలో కలుషిత నీటి కలకలం...

### కార్మికుల ఆరోగ్యంపై ముప్పు...

### సింగరేణి నీటి సరఫరాపై బీఆర్ఎస్ నేత కౌశిక హరి తీవ్ర ఆగ్రహం...

గోదావరిఖని//**మార్చి 30 (ఆకాంక్ష) :** రామగుండం పట్టణంలో కలుషిత నీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. ముఖ్యంగా సింగరేణి కార్మికులకు సరఫరా అవుతున్న త్రాగునీటి నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతూ, స్థానికంగా ఆందోళన నెలకొంది. గోదావరి నదిలోకి మురుగునీరు చేరుతున్న నేపథ్యంలో, అదే నీటిని తగిన శుద్ధి లేకుండా కార్మికులకు అందిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఈ విషయంపై బీఆర్ఎస్ నేత కౌశిక హరి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. గోదావరి నది ఇప్పటికే కాలుష్యానికి గురైందని, అలాంటి నీటిని సరైన శుద్ధి చేయకుండా త్రాగునీటిగా సరఫరా చేయడం అనేది బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.ఇటీవల ఫిల్టర్ బెడ్ పనులు ఆలస్యమవుతున్నాయన్న అంశం కూడా వివాదానికి దారితీసింది. ఈ పనులు పూర్తవకపోవడం వల్ల శుద్ధి ప్రక్రియలో లోపాలు తలెత్తుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఫలితంగా కార్మికులకు అందుతున్న నీరు నాణ్యత లేనిదిగా మారుతోందని ఆరోపిస్తున్నారు.ఈ పరిస్థితుల నేపథ్యంలో సింగరేణి కార్మికులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని సమాచారం. కాలుష్య నీరు తాగడం వల్ల జీర్ణ సంబంధ వ్యాధులు, చర్మ సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ అంశంపై సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.రామగుండంలో మంచినీటి సమస్య రోజురోజుకూ ముదురుతోంది. సరైన నీటి సరఫరా లేకపోవడం, శుద్ధి చేయని నీరు అందించడం వంటి సమస్యలు ప్రజల జీవనాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేత కౌశిక హరి డిమాండ్ చేశారు. కార్మికులకు సురక్షితమైన త్రాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.గోదావరి కాలుష్యం కారణంగా కార్మికుల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని, ఈ సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే మరింత తీవ్రమైన పరిస్థితులు తలెత్తే అవకాశముందని నిపుణులులో హెచ్చరిస్తున్నారు. సింగరేణి యాజమాన్యం, సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకొని, కార్మికులకు నాణ్యమైన త్రాగునీరు అందించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.మొత్తానికి రామగుండంలో కలుషిత నీటి సమస్య ప్రజల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.ప్రభుత్వం,అధికారులు వెంటనే స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి.

# పెద్దపల్లి జిల్లాలో నిజాయితీకి నిదర్శనం...

### అవసరం లేదని ప్రభుత్వ గృహాన్ని వదిలిన కుటుంబం...

### డబుల్ బెడ్‌రూమ్ గృహాన్ని స్వచ్ఛందంగా తిరిగి అప్పగించిన దంపతులు...



పెద్దపల్లిటౌన్//**మార్చి 30 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లాలో ఓ దంపతులు ప్రదర్శించిన నిజాయితీ, సామాజిక బాధ్యత అందరినీ ఆకట్టుకుంది. ప్రభుత్వ సంక్షేమ పథకంలో భాగంగా పొందిన డబుల్ బెడ్‌రూమ్ గృహాన్ని అవసరం లేదని భావించి తిరిగి ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా వారు ఆదర్శంగా నిలిచారు. జిల్లాకు చెందిన శ్రీమతి వరహగిరి శైలజ,ఆమె భర్త వెంకటరావు సోమవారం పెద్దపల్లి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు డబుల్ బెడ్‌రూమ్ గృహాన్ని స్వచ్ఛందంగా తిరిగి అందజేశారు. తమ పిల్లలు సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడటంతో ప్రస్తుతం తమకు గృహం అవసరం లేదని భావించి, ఆ ఇల్లు నిజంగా అవసరమైన నిరుపేద కుటుంబానికి కేటాయించాలని వారు కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, అవసరం లేకపోయినా ప్రభుత్వ ఆస్తిని తిరిగి ఇచ్చిన శైలజ దంపతులు నిజాయితీకి నిదర్శనమని కొనియాడారు. ఇలాంటి చర్యలు సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయని, ఇతరులకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిజంగా అర్హులైన వారికి అందేలా ప్రతి పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం నగరంలో ఆదర్శ మేయర్...

### శాలువాలకు నో చెప్పి విద్యార్థులకు మద్దతు...



గోదావరిఖని//**మార్చి 30 (ఆకాంక్ష) :** సమాజానికి ఆదర్శంగా నిలుస్తూ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి. తనను మర్యాదపూర్వకంగా కలిసే సందర్శకుల నుండి శాలువాలు, పుష్పగుచ్ఛాలు స్వీకరించే పద్ధతికి భిన్నంగా, విద్యార్థులకు ఉపయోగపడే నోట్ బుక్స్, పెన్నులు మాత్రమే స్వీకరిస్తూ ప్రత్యేకత చాటుతున్నారు. సోమవారం ఆయనను కలిసిన పలువురు శాలువాలు తీసుకువచ్చినప్పటికీ, వాటిని సున్నితంగా తిరస్కరించిన మేయర్ మహంకాళి స్వామి, బదులుగా నోట్ బుక్స్, పెన్నులు ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీ చైతన్య కళాశాల నిర్వాహకులు, అశోక్ నగర్‌కు చెందిన వాసికూచన సాంబయ్య తదితరులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి నోట్ బుక్స్, పెన్నులు బహుకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, "విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులు మాత్రమే స్వీకరిస్తాను. సమాజానికి ఉపయోగకరమైన పనులు చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని తెలిపారు. మేయర్ చేపట్టిన ఈ వినూత్న నిర్ణయం స్థానికంగా ప్రశంసలు అందుకుంటోంది. విద్యకు ప్రాధాన్యత ఇస్తూ సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడే ఈ చర్యను పలువురు అభినందిస్తున్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంక్ లక్ష్యం...

### రామగుండం మేయర్ మహంకాళి స్వామి...



గోదావరిఖని//**మార్చి 30 (ఆకాంక్ష) :** స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంక్ సాధించడమే తమ ధ్యేయమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి స్పష్టం చేశారు. సోమవారం మునిసిపల్ కార్యాలయం నుంచి ఫైవ్ ఇంక్ లైన్ వరకు ఉన్న ప్రధాన రహదారిని స్వీపింగ్ యంత్రంతో శుభ్రపరిచే పనులను ఆయన ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగర పాలక సంస్థ వద్ద ఉన్న స్వీపింగ్ యంత్రం చెడిపోవడంతో ప్రత్యామ్నాయంగా ఎమ్మెల్యే సహకారంతో హెచ్‌కేఆర్ సంస్థ నుంచి యంత్రాన్ని తెప్పించి శుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని తక్కువ ఖర్చుతో పనిచేసే ట్రాక్టర్ మౌంటెడ్ స్వీపింగ్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రామగుండం నగరాన్ని స్వచ్ఛ నగరంగా తీర్చిదిద్దడం పాలకవర్గం బాధ్యతగా భావిస్తున్నామని, ప్రజలు కూడా సహకరించి చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మునిసిపల్ వాహనాలకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి. రామన్, టిపిఎస్ నవీన్, సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్చర్లలో విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన సదస్సు...



జడ్చర్ల//**మార్చి 30 (ఆకాంక్ష) :** మిడ్జిల్ మండల కేంద్రంలో విద్యార్థులకు డ్రగ్స్ ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సదస్సు నిర్వహించారు. డీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు యువతను తప్పుదారి పట్టిస్తున్నాయని, ముఖ్యంగా స్కూల్ పిల్లలు ఇలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు మెదడు పనితీరు తగ్గిపోతుందని, దీని ప్రభావం జీవిత లక్ష్యాలపై పడుతుందని ఆయన హెచ్చరించారు. అలవాట్లకు బానిసైతే భవిష్యత్తు అంధకారమవుతుందని, విద్యార్థులు తమ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే మంచి అలవాట్లు అలవరచుకోవాలని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. భావి భారత పౌరులుగా మారి రాబోయే తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి, మిడ్జిల్ గ్రామ సర్పంచ్ ఎడ్ల శంకర్, డిప్యూటీ సర్పంచ్ మమతా మన్యం, ఎమ్మార్వో స్వప్న, ఎంపీడీవో గీతాంజలి, మిడ్జిల్ పోలీస్ సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బృందం, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బరిగెల యాదయ్య, బరిగెల నరసింహ, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సహాయం అందించిన

# 6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి...



మంథని//**మార్చి 30 (ఆకాంక్ష) :** మంథని మున్సిపల్ పరిధిలో గల బోయిన్ పేట్ కి చెందిన మూగ ఆకాష్ ఇటీవల ప్రమాదానికి గురై కరీంనగర్ లో ప్రయివేట్ ఆసుపత్రి లో చికిత్స పొంది ఆరోగ్యంతో ఇంటికి తిరిగి వచ్చిన ఆకాష్ ను బోయిన్ పేట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి పరామర్శించి వారి కుటుంబానికి తన మిత్రుల సహాయ సహకారంతో జమ చేసిన 21000/-వేల రూపాయలను వారికి అందించి అండగా నిలిచారు. నిస్వార్థంగా సహాయం అందించిన ఖజూవ× హాస్పిటల్ డాక్టర్ భరత్ రెడ్డి బోయిన్ పేట్ యువతకు తన మిత్రులకు ధన్యవాదములు తెలిపారు. గతంలో కూడ బోయిన్ పేట్ లో ఎవరు ఆపదలో ఉన్న వారికీ అండగా నిలుస్తూ ప్రతి కుటుంబానికి తనకు తోచిన సహాయం అందిస్తున్న పోతరవేని శ్రీలతక్రాంతి ని బోయిన్ పేట్ వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వాడికి సంబంధించిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తిదారుల బడ్జెట్ పెంచాలి...

### రజకులకు రక్షణ చట్టం అవసరం...

### ఏప్రిల్‌లో గ్రామ స్థాయిలో చైతన్య సభలు నిర్వహణకు నిర్ణయం...





మంచిర్యాల//**మార్చి 30 (ఆకాంక్ష) :** మంచిర్యాల పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో సోమవారం రజక వృత్తిదారుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంగేపు హనుమంతు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 202627 బడ్జెట్‌లో రజక వృత్తిదారుల సంక్షేమానికి కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది 2025లో రూ.183 కోట్లు కేటాయించినప్పటికీ అవి పూర్తిగా ఖర్చు చేయలేదని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ పథకానికి తగిన నిధులు విడుదల చేయకపోవడంతో కరెంటు బిల్లులు పెరిగి వృత్తిదారులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. చేతివృత్తిదారుల అభివృద్ధికి భారీగా బడ్జెట్ కేటాయిస్తామని, రుణాలు, పెన్షన్లు, కమ్యూనిటీ హాళ్లు, మోడ్రన్ దోబీఘాట్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని అన్నారు. అదేవిధంగా రజక వృత్తిదారులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వృత్తిదారుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ నెలలో గ్రామ స్థాయిలో చైతన్య సభలు నిర్వహించి, భవిష్యత్తులో ఉద్యమాలకు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం మంచిర్యాల జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు, జిల్లా ఉపాధ్యక్షులు గంగారాజుల రామచంద్ర, పైతార ఓదేల్, ముస్కె చందు, భాగ్య, శనిగరపు సత్యం, మామిడి రమేష్, కోటిపల్లి కళావతి, కొండపర్తి లక్ష్మణ్, తాటికోండ రమేష్, కొండపర్తి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

### పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో

# అరుదైన శస్త్రచికిత్స విజయవంతం...

### గర్భాశయంలోని భారీ గడ్డ తొలగింపు...

### మహిళకు పునర్జన్మ...





పెద్దపల్లిటౌన్//**మార్చి 30 (ఆకాంక్ష) :** పెద్దపల్లి జిల్లా మాతా శిశు ఆసుపత్రి (ఏిజిఎ)లో వైద్యులు మరోసారి తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఓ మహిళకు అత్యాధునిక విధానంలో శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా గర్భాశయంలోని భారీ గడ్డను తొలగించారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 45 ఏళ్ల మహిళ గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పి, అధిక రక్తస్రావంతో బాధపడుతూ జిల్లా ఆసుపత్రిని ఆశ్రయించారు. ఆమెను పరీక్షించిన వైద్యులు గర్భాశయంలో పెద్ద గడ్డ ఉన్నట్లు గుర్తించారు. పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో గైనకాలజిస్ట్ డాక్టర్ అనసూయ, అనస్థీషియా నిపుణుడు డాక్టర్ రామం ఆధ్వర్యంలో వైద్య బృందం హిస్టరెక్టమీ (గర్భాశయ తొలగింపు) శస్త్రచికిత్సను అత్యంత జాగ్రత్తగా నిర్వహించింది. శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తవడంతో మహిళ ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఈ అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన డాక్టర్ అనసూయ, డాక్టర్ రామం మరియు ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కూడా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ఆయన తెలిపారు. జిల్లా ఆసుపత్రిలో శిశు సంరక్షణ కేంద్రం, 2ఓ ఎకో, లాప్రోస్కోపిక్ శస్త్రచికిత్సలు, యూరాలజీ, రూట్ కెనాల్ వంటి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని సూపరింటెండెంట్ వెల్లడించారు. అదే విధంగా, ప్రభుత్వ ఆసుపత్రిలో అందించే అన్ని సేవలు పూర్తిగా ఉచితమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరూ డబ్బులు చెల్లించవద్దని సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత, సేవలపై ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే నర్సింగ్ సూపరింటెండెంట్, ఆర్ఎంఓ లేదా తనను నేరుగా సంప్రదించాలని కోరారు. ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్ ద్వారా కూడా తెలియజేయవచ్చని, సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### నాగర్ కర్నూలు జిల్లా

# ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు ఘన సన్మానం...

### జాతీయ స్థాయి అవార్డు సాధించిన డాక్టర్ ఉషారాణి ప్రతిభకు అభినందనలు...



నాగర్ కర్నూల్//**మార్చి 30 (ఆకాంక్ష) :** దేశవ్యాప్తంగా నవజాత శిశు ఆరోగ్య సేవల్లో విశిష్ట సేవలు అందించినందుకు గాను గుర్తింపు పొందిన నాగర్ కర్నూలు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోట ఉషారాణికి ఘన సన్మానం జరిగింది. ఇటీవల కలకత్తాలో జరిగిన నియోనెటల్ ఫెలోషిప్ 44వ వార్షికోత్సవ జాతీయ సదస్సులో దేశంలోని ప్రముఖ పీడియాట్రిక్ విభాగానికి చెందిన 8మందిలో ఒకరిగా ఎంపికై అవార్డు అందుకున్న నేపథ్యంలో ఈ సన్మానం నిర్వహించారు. సోమవారం ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో జిల్లా నర్సింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణికి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల పదోన్నతి పొందిన కృష్ణవేణిని కూడా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది డాక్టర్ ఉషారాణి సేవలను కొనియాడుతూ, ఆమె సాధించిన విజయాలు ఆసుపత్రికి గర్వకారణమని పేర్కొన్నారు. నవజాత శిశు సంరక్షణలో ఆమె చూపుతున్న కృషి మరింత మంది వైద్యులకు ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సర్జికల్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. రఘు, ఆర్.ఎం.ఓ డాక్టర్ ఏ. రోహిత్, నర్సింగ్ సూపరింటెండెంట్లు మంజుల, పెర్సీ సుమన్, హెడ్ నర్సులు అమృత, పద్మ, నర్సింగ్ ఆఫీసర్ల జిల్లా అధ్యక్షురాలు జానకి దేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. ఆనంద్, నర్సింగ్ అధికారులు సరస్వతి, అనురాధ, సునీత, కేశవ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఎస్సై పట్టుబడ్డ ఎస్సై...




నాగర్‌కర్నూల్ టౌన్//**మార్చి 30 (ఆకాంక్ష) :** నాగర్‌కర్నూల్ జిల్లాలో అవినీతి వ్యతిరేక దళం (ఏసీబీ) ఉచ్చులో ఓ ఎస్సై పట్టుబడిన సంఘటన సోమవారం కలకలం రేపింది. తిమ్మాజిపేట్ మండల పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సై హరిప్రసాద్ రెడ్డి ఓ వ్యక్తి నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారంఁ ఈ నెల 5వ తేదీన ఇసుక రవాణా చేస్తున్న ఓ వ్యక్తికి చెందిన ట్రాక్టర్, జేసీబీ వాహనాలను ఎస్సై హరిప్రసాద్ రెడ్డి పట్టుకొని కేసు నమోదు చేశారు. అనంతరం సంబంధిత వివరాలను జిల్లా మైనింగ్ అధికారులకు పంపగా, వారు ఆ వాహనాలపై రూ.60 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించిన బాధితుడు ఈ నెల 7న వాహనాల విడుదల కోసం అవసరమైన పత్రాలను సమర్పించినప్పటికీ, ఎస్సై హరిప్రసాద్ రెడ్డి అదనంగా రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఇప్పటికే జరిమానా చెల్లించిన బాధితుడు మళ్లీ లంచం ఇవ్వాల్సి రావడంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా వాయిస్ రికార్డింగ్స్ సహా పక్కా ఆధారాలు సేకరించిన ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌లో పట్టు వేశారు. రూ.20 వేల లంచం స్వీకరిస్తున్న సమయంలో ఎస్సైను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు. అవినీతి చర్యలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ం

# అంబేద్కర్ చౌరస్తాలో చెఱకు రసం మెషిన్ ప్రారంభం...



మంథనిరూరల్//**మార్చి 30 (ఆకాంక్ష) :** మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు పుప్పాల తిరుపతి నిర్వహిస్తున్న ఉడిపి హోటల్‌లో నూతన చెఱకు రసం మెషిన్‌ను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట శైలజ దంపతులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్ట శైలజ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించి, వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ చిన్నతరహా వ్యాపారాలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన చెఱకు రసం మెషిన్ ద్వారా ప్రజలకు శుద్ధమైన, ఆరోగ్యకరమైన పానీయం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ కౌన్సిలర్ సమ్మయ్య, పిల్లి సత్తయ్య, మబ్బు నాగరాజు, గంధం ఆంజనేయులు, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సర్దుబాటు...

### బదిలీలపై ఎస్టీయూ డిమాండ్...



నాగర్ కర్నూల్//**మార్చి 30 (ఆకాంక్ష) :** ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ. నెంబర్ 25ను సవరించి ఉపాధ్యాయుల సర్దుబాటు (రేషనలైజేషన్) బదిలీలను తక్షణమే చేపట్టాలని ఎస్టీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంగం మురళి పదవీ విరమణ కార్యక్రమం సోమవారం వెలమ సంఘం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా శాఖ అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్ మాట్లాడుతూ, మురళి విద్యారంగానికి, సంఘానికి చేసిన సేవలను ప్రశంసించారు. సంఘం చేసిన పోరాటాలను కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని ప్రయోజనాలను సకాలంలో అందించాలని, విద్యారంగానికి నెలకు రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జి.ఓ. 25ను సవరించి ఉపాధ్యాయుల సర్దుబాటు, బదిలీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఏ. రమేష్ కుమార్, పదవీ విరమణ పొందిన సంగం మురళిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి జె. గజేందర్, పూర్వ అధ్యక్షులు ఎం. పర్వత్ రెడ్డి, రాష్ట్ర ప్రతినిధులు వై. కరుణాకర్ రెడ్డి, పోల్ రెడ్డి, కే. రమేశ్, పూర్వ జిల్లా అధ్యక్షులు ఎం. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సంఘ ప్రతినిధులు పోకల సతీష్, మధుసూదన్ రెడ్డి, బాలస్వామి, నరసింహ, ప్రభాకర్, సత్యనారాయణ, ఈశ్వర్, రమేష్, రఘురాం రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, సురేష్, సుజాత, దుర్గా, వనపర్తి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, హరి ప్రసాద్, మహబూబ్ నగర్ బాధ్యులు నరసింహ గౌడ్, గద్వాల బాధ్యులు లక్ష్మణ్, ఇతర సంఘాల నాయకులు రాజారెడ్డి, జె. శ్రీనివాస్ రెడ్డి, వెంకటయ్య, ధర్మరాజు, రమేష్, నిరంజన్ తదితరులు హాజరయ్యారు.

# భూమి లేకుండా దళితులకు విముక్తి లేదు...

### డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్..




నాగర్ కర్నూల్//**మార్చి 30 (ఆకాంక్ష) :** దళితులకు నిజమైన సామాజిక న్యాయం భూమి పంపిణీ ద్వారానే సాధ్యమని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ స్పష్టం చేశారు. "భూమి లేకుండా దళితులకు విముక్తి లేదు" అని ఆయన ఘాటుగా పేర్కొన్నారు. దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) నాగర్ కర్నూల్ జిల్లా రెండో మహాసభ మేకల లక్ష్మీనారాయణ, తప్పెట కిరణ్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇప్పటికీ వేలాది దళిత కుటుంబాలు భూమి లేకుండా కూలి పనులపైనే ఆధారపడి జీవిస్తున్న దుర్భర పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. భూమి లేకపోవడం వల్ల దళితులు ఆర్థికంగానే కాకుండా సామాజికంగానూ వెనుకబడి పోతున్నారని తెలిపారు. అసైన్డ్ భూములు పెద్దల చేతుల్లో అక్రమంగా ఉండటం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పేదలకు అందకపోవడం తీవ్ర సమస్యగా మారిందని విమర్శించారు. భూమి పంపిణీ కార్యక్రమాలు సక్రమంగా అమలు కాకపోవడంతో దళితుల జీవితాల్లో గణనీయమైన మార్పు కనిపించడం లేదన్నారు. ఈ నేపథ్యంలో కోనేరు రంగారావు కమిటీ సిఫారసులను తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూమి సమస్య పరిష్కారానికి ఆ కమిటీ స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చినప్పటికీ, వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వం ప్రకటించిన దళిత బంధు, భూ పంపిణీ వంటి పథకాలు కేవలం ప్రచారానికే పరిమితమైపోయాయని ఆయన విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో భూమి కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉండటం వల్ల దళితులకు అవకాశాలు దూరమవుతున్నాయని పేర్కొన్నారు. దళితులకు స్వావలంబన, గౌరవ ప్రదమైన జీవనం కల్పించాలంటే ప్రతి భూమిలేని కుటుంబానికి సాగుభూమి ఇవ్వాలని, అసైన్డ్ భూముల ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. భూమి సమస్యను పరిష్కరించకుండా దళిత సంక్షేమం గురించి మాట్లాడటం మోసపూరిత రాజకీయమని తీవ్రంగా విమర్శించారు. రాబోయే డీహెచ్‌పీఎస్ రాష్ట్ర రెండో మహాసభలు ఏప్రిల్ 17, 18 తేదీలలో వరంగల్ నగరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు 33 జిల్లాల నుండి సుమారు 500 మంది ప్రతినిధులు హాజరవనున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి లక్ష్మీపతి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్ ఆనంద్, రైతు సంఘం నాయకులు సూర్యశంకర్ గౌడ్, బిజ్జా శ్రీనివాసులు, రవీందర్, చంద్రమౌళి, కొత్త రామస్వామి, చిన్నపాక శ్రీను, బాలపేరు నరసింహ, గిరి ప్రసాద్, కుమార్, కృష్ణ, సురేష్, బండి శ్రీను, పర్వతాలు, చందు తదితరులు పాల్గొన్నారు.

తొలి ఆకాంక్ష
మంగళవారం-31-మార్చి-2026

## వృద్ధాశ్రమాన్ని సందర్శించిన న్యాయ సేవ అధికార సంస్థ ప్రతినిధులు...




నాగర్‌కర్నూల్//మార్చి 30 (ఆకాంక్ష) : రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ నాగర్‌కర్నూల్ ఆధ్వర్యంలో సోమవారం బిజినపల్లి గ్రామంలోని లూర్దునగర్‌లో ఉన్న ప్రశాంత నిలయం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ మరియు సెక్రటరీ ఆదేశాల మేరకు డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీ శ్రీరామ్ ఆర్య ఈ సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులతో మమేకమై వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో వారికి మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అనే విషయాన్ని విచారించారు. అనంతరం వృద్ధులచే పాటలు పాడించి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా శ్రీరామ్ ఆర్య మాట్లాడుతూ వృద్ధాప్యం అనేది జీవితంలోని చివరి దశ కావడంతో అందరూ ఆనందంగా, ప్రశాంతంగా గడపాలని సూచించారు. వృద్ధులకు అవసరమైన సహాయ సహకారాలను తమ సంస్థ తరపున అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా వృద్ధులకు బిస్కెట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు సిస్టర్ రవికుమారి మరియు వృద్ధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్‌లో సత్యసాయి చలివేంద్రం ప్రారంభం...



నాగర్ కర్నూల్ టౌన్//మార్చి 30 (ఆకాంక్ష) : సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గత 38 సంవత్సరాలుగా కొనసాగుతున్న సత్యసాయి చలివేంద్రాన్ని సోమవారం ఆర్టీసీ బస్టాండ్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్, డిపో మేనేజర్ ఏ.యాదయ్య ప్రారంభించారు. వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరమని వారు పేర్కొన్నారు. సమితి కన్వీనర్ కే. బాలరాజ్ మాట్లాడుతూ జూన్ వరకు ప్రతిరోజూ చల్లని శుద్ధి నీటిని ప్రయాణికులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, సత్యసాయి భక్తులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1న 'బ్లాక్ డే'ను జయప్రదం చేయాలి...

సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపు...




గోదావరిఖనిటౌన్ //మార్చి 30 (ఆకాంక్ష) : కేంద్ర ప్రభుత్వం అమలు చేయనున్న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఏప్రిల్ 1న నిర్వహించనున్న 'బ్లాక్ డే'ను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. గోదావరిఖని శ్రామిక భవన్‌లో సోమవారం నిర్వహించిన సిఐటియు జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను అమలు చేయడానికి సిద్ధమవుతోందని ఆయన ఆరోపించారు. ఈ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ లేబర్ కోడ్స్ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 1న జరుగనున్న 'బ్లాక్ డే' సందర్భంగా జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు తమ తమ పని ప్రదేశాల్లో బ్లాక్ బ్యాడ్జీలు ధరించి, బ్లాక్ జెండాలతో నిరసనలు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాలు అనేకసార్లు సమ్మెలు నిర్వహించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం ఏకతాటిపైకి వచ్చి లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఏప్రిల్ 1న గోదావరిఖని, పెద్దపల్లి కేంద్రాల్లో జిల్లా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ధర్నాల్లో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు వేల్పుల కుమారస్వామి, ఉపాధ్యక్షులు ఎన్. బిక్షపతి, ఎం. రామాచారి, సిపెల్లి రవీందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిపై ఆశా వర్కర్ల భారీ ధర్నా...



జడ్చర్ల//మార్చి 30 (ఆకాంక్ష) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలోని కావరమ్మపేట జాతీయ రహదారిపై సోమవారం ఆశా వర్కర్లు భారీ ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గత ఆరు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడాన్ని నిరసిస్తూ వందలాది మంది మహిళలు రోడ్డుపై బైఠాయించి తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నా కారణంగా హైదరాబాద్ కర్నూలు జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా స్థంభించాయి. గంటకు పైగా కొనసాగిన ఈ నిరసనతో సుమారు 10 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మా జీతాలు మాకు ఇవ్వాలి.. సీఎం డౌన్ డౌన్" అంటూ ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆరు నెలలుగా వేతనాలు అందక కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందని, పస్తులతో గడపాల్సిన పరిస్థితి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించడం లేదని, వెట్టి చాకిరీ చేయించుకుంటూ జీతాలు నిలిపివేయడం అన్యాయమని మండిపడ్డారు. ధర్నా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే తమ సమస్యకు పరిష్కారం వచ్చే వరకు కదిలేది లేదని ఆశా వర్కర్లు భీష్మించారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. స్థానిక ఎమ్మెల్యే వెంటనే జోక్యం చేసుకుని తమ సమస్యను పరిష్కరించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. సంబంధిత అధికారులు రాతపూర్వక హామీ ఇవ్వకపోతే పోరాటం కొనసాగుతుందని వారు హెచ్చరించారు. ఈ ఘటనతో జడ్చర్ల పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా పోలీసులు భారీగా మోహరించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అధికారులు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

## మెదక్ జిల్లాలో ఐపీఎల్ బెట్టింగ్‌పై కఠిన చర్యలు: ఎస్పీ హెచ్చరిక...



మెదక్//మార్చి 30 (ఆకాంక్ష) : జిల్లాలో ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లతో పాటు ఇతర క్రీడలకు సంబంధించిన బెట్టింగ్ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు స్పష్టం చేశారు. బెట్టింగ్‌లకు పాల్పడే వారు మాత్రమే కాకుండా వాటిని ప్రోత్సహించే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత బెట్టింగ్‌ల మోజులో పడుతూ తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టుకుంటున్నారని ఎస్పీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలు యువత జీవితాలను దెబ్బతీసే ప్రమాదం ఉందని, కుటుంబాలపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. జిల్లాలో ఎక్కడైనా ఐపీఎల్ లేదా ఇతర బెట్టింగ్ కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలని ఆయన ప్రజలకు సూచించారు. అదేవిధంగా డయల్ 100 లేదా కంట్రోల్ రూమ్ నంబర్ 8712657888కు సమాచారం అందించవచ్చని తెలిపారు. బెట్టింగ్‌లపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించిన ఎస్పీ, చట్టాన్ని అతిక్రమించే వారిపై ఎటువంటి రాయితీ ఉండదని స్పష్టం చేశారు. ప్రజలు, ముఖ్యంగా యువత, ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## జడ్చర్లలో ఉదండాపూర్ నిర్వాసితులకు మరో రూ.150 కోట్లు విడుదల...




జడ్చర్ల//మార్చి 30 (ఆకాంక్ష) : ఉదండాపూర్ ప్రాజెక్టు నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద మరో రూ.150 కోట్లను విడుదల చేసినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. దీంతో ఇప్పటివరకు నిర్వాసితులకు చెల్లించిన మొత్తం రూ.400 కోట్లకు చేరినట్లు వెల్లడించారు. మిగిలిన బకాయిలను కూడా త్వరలోనే అందించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని జలసౌధలో ఈ నెల 8న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌పై జరిగిన సమీక్ష సమావేశంలో నిర్వాసితుల బకాయిల అంశం ప్రస్తావనకు వచ్చిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద పరిహారాన్ని రూ.18 లక్షలకు పెంచిన నేపథ్యంలో అదనంగా రూ.146 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు తెలిపారు. ఈ పెంపుతో ప్రస్తుతం నిర్వాసితులకు ఇంకా రూ.338 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రెండు నెలల్లో బకాయిలు చెల్లిస్తామని ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగా మార్చి నెలలో విడుదల చేయాల్సిన రూ.150 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. మిగిలిన మొత్తాన్ని ఏప్రిల్‌లో తీసుకురావడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఇచ్చిన హామీ ప్రకారం నిధులు విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్కలకు అనిరుధ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ఎలాంటి చెల్లింపులు జరగలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత గడచిన ఏడాది కాలంలోనే రూ.250 కోట్లు విడుదల చేసి, తాజాగా మరో రూ.150 కోట్లు జోడించడంతో మొత్తం రూ.400 కోట్లకు చేరిందని వివరించారు. అధిక పరిహారం కోరుతూ కోర్టును ఆశ్రయించిన నిర్వాసితులతో చర్చించి వారికి కూడా న్యాయం చేయాలని ఇప్పటికే ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. అదేవిధంగా మల్లన్నసాగర్ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసిన విధంగానే ఉదండాపూర్ నిర్వాసితులకు కూడా కేటాయించిన ప్లాట్లను రిజిస్టర్ చేసి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌తో ఇప్పటికే చర్చించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## నాగర్‌కర్నూల్‌లో చికెన్ సెంటర్ల బంద్ హెచ్చరిక...

మార్జిన్ పెంచకపోతే ఏప్రిల్ 1 నుంచి సామూహిక నిరసన...




నాగర్‌కర్నూల్//మార్చి 30 (ఆకాంక్ష) : పౌల్ట్రీ కంపెనీలు చికెన్ సెంటర్ యాజమాన్యాలకు సరైన మార్జిన్ ఇవ్వకపోతే ఏప్రిల్ 1వ తేదీ నుంచి సామూహికంగా బంద్ నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ తాలూకా చికెన్ సెంటర్స్ అసోసియేషన్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు తీగల సుభాష్ మాట్లాడుతూ పౌల్ట్రీ కంపెనీల వ్యవహారంతో తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పౌల్ట్రీ కంపెనీలు చికెన్ సెంటర్ నిర్వాహకులకు తక్కువ మార్జిన్ అందిస్తున్న కారణంగా వర్కర్ల జీతాలు, దుకాణాల అద్దెలు, విద్యుత్ బిల్లులు చెల్లించడం కష్టంగా మారిందని తెలిపారు. రోజురోజుకూ ఖర్చులు పెరుగుతున్నప్పటికీ ఆదాయం తగ్గిపోవడంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్లిపోతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో చికెన్ సెంటర్ యాజమాన్యాల సమక్షంలో సమావేశం నిర్వహించి ఏప్రిల్ 1 నుంచి బంద్ పాటించాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా నాగర్‌కర్నూల్ తాలూకాలో కూడా పూర్తిస్థాయిలో బంద్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. పౌల్ట్రీ కంపెనీల ఆధిపత్యం వల్ల చికెన్ సెంటర్ నిర్వాహకులు తీవ్రంగా నలిగి పోతున్నారని, తాము ఉపాధి పొందడమే కాకుండా మరికొందరికి ఉపాధి కల్పిస్తున్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో వ్యాపారం భారంగా మారి అప్పులపాలు అవుతున్నామని తెలిపారు. పౌల్ట్రీ యాజమాన్యాలపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడం వల్ల వారు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయిస్తూ, మార్జిన్ విషయంలో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. తమ డిమాండ్లను పౌల్ట్రీ కంపెనీలు పరిగణనలోకి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, అవసరమైతే పౌల్ట్రీ యాజమాన్యాల ఆధ్వర్యంలోని దుకాణాలను కూడా బంద్ చేయిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం పౌల్ట్రీ కంపెనీలపై నియంత్రణ విధించేలా చట్టాలు తీసుకురావడంతో పాటు చికెన్ సెంటర్ నిర్వాహకులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మార్జిన్ పెంపుపై తక్షణ చర్యలు తీసుకోకపోతే ఏప్రిల్ 1 నుంచి నిరసనగా దుకాణాలు మూసివేస్తామని స్పష్టం చేశారు.

## సింగూర్ నుంచి ఘనపూర్‌కు 0.3 టీఎంసీ నీరు విడుదల చేయాలి...

పద్మ దేవేందర్ రెడ్డి డిమాండ్...

మెదక్//మార్చి 30 (ఆకాంక్ష) : సింగూర్ ప్రాజెక్ట్ నుంచి ఘనపూర్ రాయకట్టకు తక్షణమే 0.3 టీఎంసీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎం. పద్మ దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పాపన్నపేట మండలం చిత్రియాల గ్రామ శివారులో పంటపొలాలను పార్టీ నాయకులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఏడాది రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని సాగునీటిని విడుదల చేసి, రెండు పంటలు పండించే అవకాశాన్ని కల్పించారని గుర్తుచేశారు. ఘనపూర్ ఆయకట్ట పరిధిలో ఎఫ్ఎం, ఎఫ్ఎన్ కాలువల ద్వారా మూడు మండలాలకు సాగునీరు అందుతూ రైతులు సుసంపన్నంగా పంటలు పండించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. పండించిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేసి, మద్దతు ధర అందించడం ద్వారా రైతులకు భరోసా కల్పించిందని తెలిపారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నీటి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. ఈ సీజన్‌లో సింగూర్ నుంచి నీరు విడుదల చేయక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసిన ఎలాంటి స్పందన రాలేదని విమర్శించారు. రైతులకు క్రాప్ హాలిడే ప్రకటించకపోవడం, నష్టపరిహారం ఇవ్వకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. నర్సాపురం ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అసెంబ్లీలో ఈ సమస్యను ప్రస్తావించినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని తెలిపారు. పంటలు పొట్టదశలో ఉన్న ప్రస్తుత పరిస్థితిలో వెంటనే నీటిని విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిత్రియాల్ సర్పంచ్ సురేష్, పాపన్నపేట మండల పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాల గౌడ్, మాజీ రైతుబంధు అధ్యక్షులు సోములు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కొత్తపల్లి జగన్, మాజీ సర్పంచులు గురుమూర్తి గౌడ్, బద్రి, మల్లేశం, శ్రీనాథ్ రావు, పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## భూమి అడ్వాన్స్ డబ్బులను తిరిగి ఇప్పించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు...

న్యాయం చేయాలంటూ వినతి...




పెద్దపల్లి//మార్చి 30 (ఆకాంక్ష) : పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వెంకట్రావుపల్లి గ్రామంలో భూమి కొనుగోలు విషయంలో మోసం జరిగిందని ఆరోపిస్తూ ఓ పేద కుటుంబం జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించింది. బాధితుడు ఓడ్నాల తిరుపతి తన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల ప్రకారం, వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన ఓడ్నాల తిరుపతి (తండ్రి: కోటయ్య) 2021లో ఇంటి నిర్మాణం కోసం అదే గ్రామానికి చెందిన కొమ్మ మల్లేశం (తండ్రి: కొమురయ్య) వద్ద రెండు గుంటల భూమి కొనుగోలు చేయడానికి ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో లక్ష రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించినప్పటికీ, భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా ఆలస్యం చేస్తూ వచ్చారని తెలిపారు. అనంతరం అదే భూమిని అధిక ధరకు మరొకరికి విక్రయించారని ఆరోపించారు. ఈ విషయమై గత ఐదు సంవత్సరాలుగా గ్రామ స్థాయిలో పంచాయతీలు జరిగినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని బాధితులు వాపోయారు. మాజీ ఎంపీటీసీ భర్త కొమ్మ ప్రసాద్ యాదవ్, ప్రస్తుత సర్పంచ్ భర్త మచ్చ యాదగిరి మధ్యవర్తిత్వం వహిస్తూ డబ్బులు తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అయితే సర్పంచ్ ఎన్నికల అనంతరం మాట తప్పి, ఇప్పుడు డబ్బులు ఇవ్వబోమని చెప్పడమే కాకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు చెల్లించాల్సిన అడ్వాన్స్ మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని, బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తిరుపతి భార్య లత జిల్లా కలెక్టర్‌ను వినతి పత్రం ద్వారా కోరారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు విచారణ చేపట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ఉచిత ఇంటర్న్‌షిప్ అవకాశం...



నాగర్‌కర్నూల్//మార్చి 30 (ఆకాంక్ష) : ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు నెలరోజుల పాటు ఉచిత ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ & కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. గీతాంజలి తెలిపారు. విద్యార్థులలో వృత్తి నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, వ్యక్తిత్వ వికాసం మరియు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకు ఈ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ ఇంటర్న్‌షిప్‌లో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ) సహాయంతో ఎంఎస్ ఆఫీస్ బేసిక్స్, వ్యక్తిత్వ వికాసం, అలాగే తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలు మరియు సాహిత్యంపై సమగ్ర శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌ను తాజాగా లేదా గత సంవత్సరం పూర్తి చేసిన విద్యార్థులు ఈ కార్యక్రమానికి అర్హులని పేర్కొన్నారు. ఏప్రిల్ 1నుండి ఏప్రిల్ 30 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్ & కామర్స్), శ్రీపురం రోడ్‌లో ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు కళాశాలను సంప్రదించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున ముందస్తుగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధి అవకాశాలకు సిద్ధమవడంతో పాటు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే మంచి అవకాశం లభిస్తుందని ప్రిన్సిపాల్ గీతాంజలి పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 6302057411, 81792 26268 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

## రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో భూమి వివాదం...

"మా స్థలంలో పెట్టిన మున్సిపల్ బోర్డు తొలగించాలి...



1

To:
The Honorable District Collector,
Ranga Reddy District,
Kongarakalan.

Date:- 28-03-2026

Respected Sir

Subject:- Application seeking orders to the Commissioner, Shadnagar Municipality to remove the board erected in my plots in Sy.Nos. 25 and 28 of Faruqnagar Village – Requested – Regarding.
<><><>

I, Md. Arshad S/o Md. Afzal, R/o H.No.18-397/94, CSK Enclave, Shadnagar town, Faruqnagar Mandal, Rangareddy District respectfully submits that, Yeddula Swamy Bhupal and Muzawar Maqbul Basha were purchased the land in Sy.Nos.28/EE (3-27), 28/U and 28/UU (7-13), 28 (3-20), 28/E (01-00), 25/A and 28/E (02-00) totally admeasuring Ac.17-20 Guntas situated in the limits of Faruqnagar Revenue Village, Shadnagar town, Faruqnagar Mandal, Rangreddy District though Regd. Sale deed Nos.194/200, 2793/1999, 1858/2000, 1993/2000 and 3564/1999.

It is submitted that Yeddula Swamy Bhupal Reddy, Muzawar Sharifa Bee, Muzawar Mustaq Basha and Masood Basha executed a registered General Power of Attorney vide document No.26/2026, Dt.10-02-2026 in favour of myself and Mohd.Khaja Pasha appointing ourselves as their lawful attorney.

It is pertinent to submit here that, recently the Commissioner Shadnagar Municipality erroneously erected a Board at the above land stating that, the area of the above land is "Municipal Land". In fact the above said open land in Sy.Nos.25 and 28 of Faruqnagar Village is not at all assigned land or Government land or Municipal land. I have obtained the information from the Commissioner, Shadnagar Municipality under RTI Act 2005 vide Lr.No.G1/RTI/433/2026, Dt.28-03-2026 in which the Commissioner, Shadnagar Municipality in which the said authority declared that, the Shadnagar Municipality have no land in Sy.No. 25 & 28.

షాద్‌నగర్//మార్చి 30 (ఆకాంక్ష) : షాద్‌నగర్ పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీలో భూమి వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. తమకు చెందిన భూమిలో మున్సిపాలిటీ అధికారులు చట్ట విరుద్ధంగా బోర్డు ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ స్థానికుడు మహమ్మద్ అర్షద్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర వెంచర్‌లో ఉన్న సర్వే నంబర్లు 25, 28ల భూమిపై మున్సిపల్ కార్యాలయం తరపున "మున్సిపాలిటీ భూమి" అంటూ బోర్డు పాతిన విషయం వివాదానికి కారణమైంది. ఈ స్థలం అసలు ప్రభుత్వానికి గానీ, మున్సిపాలిటీకి గానీ చెందదని అర్షద్ వాదిస్తున్నారు. ఈ అంశంపై సమాచార హక్కు చట్టం కింద మున్సిపాలిటీని సంప్రదించిన అర్షద్‌కు, సర్వే నంబర్లు 25, 28లో లేఅవుట్ అనుమతులు లేవని, సంబంధిత భూమికి మున్సిపాలిటీ వద్ద ఎటువంటి రికార్డులు లేవని అధికారుల సమాధానం లభించింది. అలాగే, ఆ భూమిలో 10 శాతం రోడ్డు లేదా పబ్లిక్ యుటిలిటీ కోసం మున్సిపాలిటీ పేరిట నమోదు కాలేదని కూడా స్పష్టం చేసినట్లు తెలిపారు. దీంతో మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి ఆదేశాలతో ఏర్పాటు చేసిన బోర్డు పూర్తిగా తప్పిదమని, వెంటనే తొలగించాలని అర్షద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మార్చి 30న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు సమర్పించారు. కలెక్టర్‌కు సమర్పించిన పత్రంలో, యెద్దుల స్వర్ణ భూపాల్ మరియు ముజావర్ మక్బుల్ బాషా తదితరులు గతంలో సర్వే నంబర్లు 25, 28లలో భూములను కొనుగోలు చేసి, ఆస్తి హక్కులను నమోదు చేసుకున్నట్లు వివరించారు. తదనంతరం 2026 ఫిబ్రవరి 10న రిజిస్టర్డ్ జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ ద్వారా తమను ప్రతినిధులుగా నియమించినట్లు తెలిపారు. అయితే ఎటువంటి ఆధారాలు లేకుండా మున్సిపాలిటీ ఈ భూమిని తమదిగా ప్రకటిస్తూ బోర్డు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని, దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అర్షద్ కలెక్టర్‌ను కోరారు. ఈఘటనతో శ్రీ వెంకటేశ్వర కాలనీలో భూమి యాజమాన్యంపై అనుమానాలు నెలకొనగా, సమస్య పరిష్కారానికి అధికారులు తీసుకునే చర్యలపై స్థానికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.